ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి
"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.
అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.
- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
సంపుటి: 6 సంచిక: 76, పేజీలు - 08
ఆదివారం, సెప్టెంబర్ 13, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD


- Host On Your Domain
- Hosting / Admin Panel
- Page Builder / Social Links
- Responsive Design
- Advertisement Spaces
- Search Engine Optimization
- XML Sitemap
- Automatic Software Updates
Publish Your Newspaper/Website Online
Contact Us : 9666136456

## నిర్ణయాధికారం శక్తిగా
# "గ్లోబల్ సౌత్"
### - బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోదీ కీలక ప్రసంగం




- ప్రపంచ పాలనలో గ్లోబల్ సౌత్ దేశాలకు కీలక పాత్ర దక్కాలని స్పష్టీకరణ
- అధికారాల పిరమిడ్‌ను భాగస్వామ్య వేదికగా మార్చాలని పిలుపు
- బ్రిక్స్ సంస్కరణల కోసం మూడు స్తంభాలతో రోడ్‌మ్యాప్ ప్రతిపాదన
- ఏకాభిప్రాయంతోనే ముందుకు వెళతామని, ఎవరికీ వ్యతిరేకం కాదని ఉద్ఘాటన

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) గ్లోబల్ సౌత్ తప్పనిసరిగా రూల్స్ రూపొందించేదిగా మారాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాక్షించారు. ప్రపంచ పాలన ప్రస్తుత నిర్మాణం ఒక పిరమిడ్ లాగా కనిపిస్తుందని అధికారం, నిర్ణయాధికారం అత్యున్నత స్థాయిలోనే కేంద్రీకృతమై ఉన్నాయని అయితే ఆ నిర్ణయాల ప్రభావానికి గురయ్యే దేశాలు మాత్రం అట్టడుగున ఉండిపోయాయని చెప్పారు. ఆ దేశాలకు నిర్ణయాధికారంలో నామమాత్రపు పాత్రనే ఉందని చెప్పారు. ప్రపంచ సంక్షోభాలను ఎదుర్కోవడంలో 'గ్లోబల్ సౌత్' ముందు వరుసలో ఉన్నప్పటికీ నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో మాత్రం వెనుకబడి ఉందని

2లో..



## పరస్పరం పాఠాలు నేర్చుకుని
# ముందుకు సాగుదాం
### - ద్వైపాక్షిక భేటీలో మోదీ, జిన్‌పింగ్ స్నేహగీతం



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు వేదికగా భారత ప్రధాని నరేంద్ర మోదీతో జరిగిన ద్వైపాక్షిక భేటీలో భారత్-చైనాలు పరస్పరం ఒకరి బలాలు, నైపుణ్యాల నుంచి పూర్తిగా నేర్చుకోవాలని, ఒకరికొకరు మద్దతుగా నిలవాలని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ తెలిపారు. ఏడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత తొలిసారిగా భారత్‌కు వచ్చిన షీ జిన్‌పింగ్, న్యూఢిల్లీలో ప్రధాని మోదీతో సరిహద్దు వివాదాలు, వర్తకం, పెట్టుబడుల అంశాలపై కీలక చర్చలు జరిపారు. భారత్ వేదికగా జరుగుతున్న ఈ రెండు రోజుల బ్రిక్స్ సదస్సు సందర్భంగా ఇరువురు నేతల భేటీ జరిగింది. "మీకు హృదయపూర్వక స్వాగతం పలకడం నాకు ఎంతో సంతోషాన్నిస్తోంది. బ్రిక్స్ సదస్సులో మీరు చేసిన సానుకూల వ్యాఖ్యలకు ధన్యవాదాలు.

2లో..

## జనవరి 1 నుంచి హెల్త్ రికార్డుల
# డిజిటలైజేషన్
### - విజయవాడ సభలో చంద్రబాబు ప్రకటన

- క్వాంటం బయో వ్యాలీకి జాతీయ గుర్తింపు నివ్వాలని కేంద్రాన్ని కోరిన సీఎం
- జనవరి 1 నుంచి రాష్ట్రంలో ఆరోగ్య రికార్డుల డిజిటలైజేషన్ ప్రకటన
- రూ.249 కోట్లతో క్రిటికల్ కేర్ బ్లాకులు, పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌లు ప్రారంభం
- డబుల్ ఇంజన్ సర్కార్‌తో వైద్య రంగానికి కొత్త ఊపు వచ్చిందన్న చంద్రబాబు



అమరావతి (ప్రశ్న న్యూస్) వైద్యారోగ్య రంగంలో ఆధునిక సాంకేతికతను విస్తృతంగా వినియోగించడం ద్వారా ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి

2లో..

## నిరుద్యోగులకు
# టీజీపీఎస్సీ బిగ్ షాక్
### - 2022 నాటి 544 ఉద్యోగాల నోటిఫికేషన్ రద్దు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ( టీజీపీఎస్సీ ) బిగ్ అలర్ట్ ఇచ్చింది. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు (లెక్చరర్లు),

2లో..

## శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా
# గణేశ్ ఉత్సవాలు

- గణేశ్ ఉత్సవాలపై సమీక్ష నిర్వహించిన రేవంత్ రెడ్డి
- మండపాల నిర్వహకులు పోలీస్ స్టేషన్లలో సమాచారం ఇవ్వాలని సూచన
- నిమజ్జనాలు చేసే చెరువుల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ మహానగరంలో గణేశ్ ఉత్సవాలు ముగిసే వరకు మున్సిపల్, పోలీస్ శాఖలు సమన్వయంతో నిరంతరం పర్యవేక్షణ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గణేశ్ ఉత్సవాలు పర్యవేక్షణ, సమన్వయానికి ప్రత్యేక అధికారులను నియమించాలని చెప్పారు. శాసనసభ ఆవరణలోని మండలి సమావేశ మందిరంలో హైదరాబాద్ మహానగరంలో గణేశ్ ఉత్సవ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. గణేశ్ ఉత్సవాల పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో

2లో..

## ధరణి పేరుతో
# బీఆర్ఎస్ భూదందా



- బీఆర్ఎస్ హయాంలో ధరణి పేరుతో లక్షల ఎకరాల అక్రమాలు
- ధరణి తప్పిదాలతో వందల మంది రైతుల ఆత్మహత్యలు
- దివాలా తీసిన విదేశీ కంపెనీకి ధరణి నిర్వహణ బాధ్యతలు
- బండారం బయటపడుతుందనే బీఆర్ఎస్ నేతలు పారిపోతున్నారు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రజల భూములు, ఆస్తుల పరిరక్షణే తమ ప్రభుత్వ రెవెన్యూ సంస్కరణల ప్రధాన లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. శాసనసభలో 22ఏ నిషేధిత భూముల అంశంపై జరిగిన స్వల్పకాలిక చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. భూముల వ్యవహారంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత పాలకులు ధరణి పోర్టల్ ను అడ్డుపెట్టుకొని లక్షలాది ఎకరాల భూములను కొట్టేశారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

### స్వప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని వాడుకున్న ఫ్యామిలీ

భూముల అంశంపై మాట్లాడితే.. అసెంబ్లీ సాక్షిగా తమ అక్రమాల బండారం బయటపడుతుందనే భయంతోనే ప్రతిపక్ష నాయకులు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు సభకు రాకుండా తప్పించుకుని తిరుగుతున్నారని విమర్శించారు.

2లో..

# బ్లూ, గ్రీన్ సిటీగా హైదరాబాద్ అభివృద్ధి
### - 30 ఏళ్ల అవసరాలకు తగ్గట్లుగా క్యూర్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగర అభివృద్ధిపై తమకు ప్లాన్స్ ఉన్నాయని.. బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా సిటీని తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పరిశ్రమల, సమాచార సాంకేతిక శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. తెలంగాణ శాసనసభలో కోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ (క్యూర్) బిల్లును ప్రవేశపెట్టిన సందర్భంగా ఆయన మాట్లాడారు. హైదరాబాద్ నగరంలో రవాణా వ్యవస్థను క్రమబద్ధీకరించేందుకు కాంప్రిహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. హైదరాబాద్ శరవేగంగా విస్తరిస్తున్న క్రమంలో రాబోయే 30 ఏళ్ల భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మరింత సమర్థవంతంగా పాలన అందించడానికే ఈ క్యూర్ (క్యూర్) చట్టాన్ని తీసుకువచ్చినట్లు వివరించారు.
హైదరాబాద్‌లో ప్రస్తుతం జరుగుతున్న పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించిన మంత్రి శ్రీధర్ బాబు, మూసీ నది పునరుజ్జీవనం తొలిదశ పనులకు రూ.7,345.12 కోట్లతో ముందస్తు అనుమతులు మంజూరు చేశామని తెలిపారు. తాగునీటి అవసరాల కోసం 20 టీఎంసీల గోదావరి జలాలను హైదరాబాద్ నగరానికి తరలించేందుకు చర్యలు చేపట్టామని వెల్లడించారు. హైదరాబాద్‌లో మొక్కలు నాటాలని, చెట్లు పెంచి కాలుష్యాన్ని తగ్గించాలన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ఆక్సిజన్ అందాలంటే హైదరాబాద్‌ను గ్రీన్ సిటీగా తీర్చదిద్దాలని చర్యలు చేపడతామన్నారు.
పాలనా సౌలభ్యం కోసం జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజించామని, విభాగాలు సమన్వయంతో పనిచేసేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఉన్నత స్థాయి పాలకమండలిని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నగరంలో శుద్ధి చేసిన మురుగునీటిని చెట్ల పెంపకానికి, కాలుష్య నివారణకు వినియోగిస్తామన్నారు.

2లో..

## మిషన్ మోడ్‌లో ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ పనులు
### - అదనంగా మరో 1500 ఎకరాల భూసేకరణ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన ఆదిలాబాద్ విమానాశ్రయం ఏర్పాటుకు మరో బిగ్ అప్‌డేట్ వచ్చింది. వాణిజ్యపరంగానే కాకుండా వ్యూహాత్మకంగా కూడా ఎంతో ప్రాధాన్యత కలిగిన ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ (జేయూఏ) అభివృద్ధి ప్రక్రియను వేగవంతం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్

2లో..

# బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 'మాక్ అసెంబ్లీ'

- అసెంబ్లీ నుంచి సస్పెన్షన్‌కు నిరసనగా ఈ కార్యక్రమం
- 100 రోజుల హామీల అమలుపైనా చురకలు అంటించిన బీఆర్ఎస్
- సీఎం రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని వ్యంగ్యాస్త్రాలు
- మాక్ అసెంబ్లీలో పల్లా, తలసాని సెటైర్లు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మాక్ అసెంబ్లీ నిర్వహించారు. ఈ మాక్ అసెంబ్లీలో ఇరిగేషన్ శాఖ మంత్రి పాత్రలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై సెటైర్లు వేశారు. మాకు బ్యాంకు చెక్కులు అంటే అర్థమవుతుంది కానీ క్యూసెక్కులు అంటే అర్థం కాదంటూ సాగునీటి శాఖ పనితీరుపై వ్యంగ్యాస్త్రాలు వేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును బాగు చేయిస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందని, ఆ పని చేయబోమని సెటైరికల్‌గా మాట్లాడారు. సబ్జెక్ట్ ప్రిపేర్ అయి సభకు రాలేదని, సలహాదారుడు ఆదిత్యనాథ్ దాస్ చెప్పినట్లు మాట్లాడుతానంటూ పల్లా రాజేశ్వర్‌రెడ్డి వ్యంగ్యంగా

2లో..

ప్రజాప్రశ్న

హైదరాబాద్ ఆదివారం 13,సెప్టెంబర్ 2026

# నిర్ణయాధికారం శక్తిగా "గ్లోబల్ సౌత్"

తెలిపారు.భారత్ అధ్యక్షతన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం సెప్టెంబర్ 12-13 తేదీలలో ఢిల్లీలోని భారత మండపం వేదికగా జరుగుతుంది. శనివారం ఉదయం బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం ప్రారంభం సందర్భంగా భారత ప్రధాని మోదీ ప్రసంగించారు. "మీ అందరికీ భారతదేశానికి స్వాగతం పలకడం నాకు ఎంతో ఆనందాన్నిస్తోంది. భారతదేశ బ్రిక్స్ అధ్యక్షత 'పీపుల్-సెంట్రిక్, హ్యూమానిటీ-ఫస్ట్' దృక్పథంపై ఆధారపడి ఉంది. స్థితిస్థాపకత, ఆవిష్కరణలు, సహకారం, సుస్థిరత మా ప్రాధాన్యతలుగా ఉన్నాయి. ఈ ప్రాధాన్యతలతో పాటు, బ్రిక్స్ సహకారాన్ని సామాన్య ప్రజలతో అనుసంధానించడంపై మేము ప్రత్యేకంగా దృష్టి సారించాము. ఈ దార్శనికతను దృష్టిలో ఉంచుకుని 350కి పైగా సమావేశాలు నిర్వహించాం. సుమారు 30 నగరాల్లో మీ బృందాలకు స్వాగతం పలికే అవకాశం మాకు లభించింది.భారతదేశపు బ్రిక్స్ అధ్యక్షతను విజయవంతం చేయడంలో మీరందించిన చురుకైన సహకారానికి, మద్దతుకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ ఏడాది బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం ఒక చారిత్రాత్మక మైలురాయి. మనం బ్రిక్స్ 20వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నాము. మానవ జీవితంలో 20 ఏళ్ల వయస్సు పరిపక్వత, బాధ్యతతో కూడిన ఒక కొత్త దశకు నాంది పలుకుతుంది. ఇప్పుడు బ్రిక్స్ కూడా 'పరిణతి' దశకు చేరుకుంది. గత రెండు దశాబ్దాలుగా బ్రిక్స్ ప్రపంచ వేదికపై ఒక ప్రత్యేక గుర్తింపును ఏర్పరచుకుంది. మనం ఒకరి దృక్కోణాలను మరొకరు గౌరవించుకుంటూ, ఏకాభిప్రాయంతో ముందుకు సాగుతున్నాం. ఎవరినీ వ్యతిరేకించడం లక్ష్యంగా కాకుండా, అందరినీ కలుపుకొని ముందుకు సాగాలని మనం కృషి చేస్తున్నాం. బ్రిక్స్‌లో మన ఐక్యతను, ఏకాభిప్రాయాన్ని ప్రపంచ వేదికపై స్పష్టమైన ఫలితాలుగా మలచాల్సిన సమయం ఇది.రాబోయే 20 ఏళ్ల కోసం మనం ఒక కొత్త, ప్రతిష్టాత్మకమైన అజెండాపై పనిచేయాలి. మన సొంత అంతర్గత కార్యనిర్వహణ వ్యవస్థలతో ఈ ప్రక్రియను ప్రారంభించాలి. బ్రిక్స్ అధ్యక్ష పదవి ఏటా మారుతున్నప్పటికీ ఇది మన సంస్థాగత పురోగతికి ఆటంకం కలిగించకూడదు. బ్రిక్స్ కొనసాగింపు, అమలు యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని నేను ప్రతిపాదిస్తున్నాను. ట్రోయిక ఏర్పాటు ద్వారా అన్ని కార్యక్రమాలను, ఫలితాలను పర్యవేక్షించడానికి వీలు కల్పిస్తుంది. ప్రతి నిర్ణయానికి సంబంధించిన నోడల్ పాయింట్, కాలపరిమితి, అమలు స్థితిని నమోదు చేయడానికి మనం ఒక సురక్షితమైన డిజిటల్ రిపోజిటరీని కూడా సృష్టించవచ్చు.బ్రిక్స్ కూటమిని బలోపేతం చేస్తూనే, మనం ప్రపంచ సంస్కరణల కోసం కూడా ఒక మార్గాన్ని నిర్దేశించుకోవాలి. ప్రపంచ పాలన ప్రస్తుత నిర్మాణం ఒక పిరమిడ్‌ను పోలి ఉంది. అధికారం,నిర్ణయాధికారం పైభాగంలో కేంద్రీకృతమై ఉండగా.. దిగువ శ్రేణులలోని దేశాలు ఆ నిర్ణయాల వల్ల ప్రభావితమవుతాయి కానీ వాటిని రూపొందించలేవు. నేడు, గ్లోబల్ సౌత్ దేశాలు ప్రపంచ సంక్షోభాల ఎదుర్కొనే విషయంలో ముందు వరుసలో నిలుస్తున్నప్పటికీ, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో మాత్రం వెనుకబడి ఉన్నాయి. మనం ఈ 'విశేషాధికారాల పిరమిడ్'ను 'భాగస్వామ్య వేదిక'గా మార్చాలి. అక్కడ ప్రతి దేశానికి ఒక గొంతుక, ప్రతి సభ్య దేశానికి ఒక వాటా ఉండాలి. అలాగే ప్రతి ప్రయత్నానికి మానవాళి అభివృద్ధి అనేది కేంద్రంగా ఉండాలి. ఈ లక్ష్య సాధన కోసం, ప్రపంచ పాలన సంస్కరణల కోసం మనం సంయుక్తంగా 10 ప్రతిపాదనలను రూపొందించాలని నేను ప్రతిపాదిస్తున్నాను. వచ్చే శిఖరాగ్ర సమావేశం నాటికి వాటిని బ్రిక్స్ సంస్కరణల రోడ్‌మ్యాప్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం."ఈ రోడ్‌మ్యాప్‌ను రూపొందించడంలో మనం మూడు కీలక అంశాలపై దృష్టి పెట్టాలి: ప్రాతినిధ్యం, స్పందన, నియమ నిబంధనల రూపకల్పన. ప్రాతినిధ్యం విషయానికి వస్తే ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సంస్కరణను ఇకపై వాయిదా వేయలేమని నేను చెప్పాలనుకుంటున్నాను. ఈ అంశంపై చర్చలు ఒక నిర్దిష్ట కాలపరిమితితో పాటు స్పష్టమైన ఫలితాలతో ముడిపడి ఉండాలి. అదే విధంగా, అంతర్జాతీయ ఆర్థిక సంస్థలలో ఓటింగ్ హక్కులు, నాయకత్వ స్థానాలు, విధాన ప్రాధాన్యతలు నేటి ఆర్థిక వాస్తవికతలకు అనుగుణంగా మారాలి. ప్రపంచ ఆర్థిక వృద్ధిని నడిపిస్తున్న దేశాలు ప్రపంచ ఆర్థిక పాలనా రూపకల్పనలో కూడా సముచిత పాత్ర పోషించాలి.ప్రపంచ వాణిజ్యానికి నావికులు ఎంతగానో దోహదపడతారు, అయినప్పటికీ కష్ట సమయాల్లో వారికి తరచుగా మద్దతు కొరవడుతుంది. మనం 'సముద్రయాన కార్మికుల అత్యవసర సహాయక నెట్‌వర్క్' ను ఏర్పాటు చేయాలని నేను ప్రతిపాదిస్తున్నాను. ఇది సంబంధిత దేశాల సముద్ర అధికార సంస్థలను, దౌత్య కార్యాలయాలను అనుసంధానిస్తుంది. తద్వారా ఆపద హెచ్చరికలు, వైద్య సహాయం, కుటుంబ సభ్యులకు సమాచారం అందించడం, తరలింపుల వంటి విషయాలలో సహాయాన్ని సులభతరం చేస్తుంది" అని తెలిపారు. "భారతదేశం ఆతిథ్యం ఇస్తున్న ఈ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం నుంచి సందేశం స్పష్టంగా ఉండాలి, మన భవిష్యత్తు ఉమ్మడిదైతే, దానిని తీర్చిదిద్దే హక్కును కూడా పంచుకోవాలి. మాట నుండి ప్రభావం వరకు, ప్రత్యేక హక్కు నుంచి భాగస్వామ్యం వరకు ఇదే బ్రిక్స్‌ఏ20 సంకల్పం కావాలి" అని మోదీ పేర్కొన్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా గణేశ్ ఉత్సవాలు

ప్రత్యేకంగా ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు. హైదరాబాద్ నగరం ప్రశాంతంగా ఉన్నప్పుడే పెట్టుబడులు వస్తాయని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా జాగ్రత్త వహించాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

### అతిథుల వివరాలను అందించాలి

గణేశ్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు సాఫీగా సాగేందుకు నిర్వాహకుల నుంచి సహకారం ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఈ ఉత్సవాలకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని నిర్వాహకులకు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గణేశ్ ఉత్సవాలకు సంబంధించి గత సంప్రదాయాన్ని పునరుద్ధరించామని చెప్పారు. నిర్వాహకుల సమస్యలను స్వయంగా తెలుసుకోవడానికి తానే సమీక్ష నిర్వహిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. గణేశ్ మండపాలకు అతిథులను ఆహ్వానించిన సందర్భాల్లో ఆ వివరాలను నిర్వాహకులు స్థానిక కమిషనరేట్ కు అందించాలని విజ్ఞప్తి చేశారు. అవసరమైన ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడానికి పోలీసులకు వీలవుతుందని చెప్పారు. ఏదైనా అనుకోని పరిణామాలు జరిగినప్పుడు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకునేందుకు నిర్వాహకులు అందించే సమాచారం ఎంతో ఉపయోగపడుతుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

### గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్

దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో గణేశ్ మండపాలకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నామని, అయితే, మండప నిర్వాహకులు సంబంధిత అధికారుల వద్ద దరఖాస్తు చేసుకుని ఉచిత విద్యుత్ పొందాలని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఎక్కడెక్కడ మండపాలు ఏర్పాటు చేస్తున్నారో ముందుగానే సమాచారం అందిస్తే పోలీసులకు ట్రాఫిక్, బందోబస్తు నిర్వహణకు సులభంగా ఉంటుందని అన్నారు. అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మలకు ఏర్పాటు చేసినట్లే గణేశ్ నిమజ్జనాలకు అనుగుణంగా నిర్మాణ సమయంలోనే అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నిమజ్జన ప్రక్రియ సాఫీగా సాగడానికి చెరువుల వద్ద చుట్టూ క్రేన్లు ఏర్పాటు చేయడానికి అనుగుణంగా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

### మండపాలు ఏర్పాటుపై ముందస్తు సమాచారం ఇవ్వాలి

'మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత సంప్రదాయాన్ని పునరుద్ధరించాం. మీ సమస్యలు తెలుసుకునేందుకు స్వయంగా నేనే సమీక్ష నిర్వహిస్తున్నాను. మండపాలకు అతిథులను ఆహ్వానిస్తే నిర్వాహకులు ఆ వివరాలు స్థానిక కమిషనరేట్‌కు అందించాలి' అని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. 'ఊహించని పరిణామాలు జరిగినపుడు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకునేందుకు ఆ సమాచారం ఉపయోగపడుతుంది. దేశంలో ఎక్కడాలేని విధంగా మన రాష్ట్రంలో గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. మండప నిర్వాహకులు సంబంధిత అధికారుల వద్ద దరఖాస్తు చేసుకుని ఉచిత విద్యుత్ పొందాలి.ఎక్కడెక్కడ మండపాలు ఏర్పాటు చేస్తున్నారో ముందుగానే సమాచారం అందిస్తే పోలీసులకు ట్రాఫిక్, బందోబస్తు నిర్వహణకు సులభంగా ఉంటుంది'అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 'అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మలకు ఏర్పాటు చేసినట్లే గణేశ్ నిమజ్జనాలకు అనుగుణంగా నిర్మాణ సమయంలోనే జాగ్రత్తలు తీసుకోవాలి. చెరువుల వద్ద చుట్టూ క్రేన్స్ ఏర్పాటుకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఉత్సవాలు ముగిసే వరకు మున్సిపల్, పోలీస్ శాఖ నిరంతర పర్యవేక్షణ చేయాలి. కమాండ్ కంట్రోల్ సెంటర్ లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసుకోవాలి'అని సూచించారు. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్ , మహమ్మద్ అజారుద్దీన్, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, నగర ప్రజాప్రతినిధులు, జీహెచ్ఎంసీ, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ), మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ), హైడ్రా కమిషనర్లు, పోలీసు ఉన్నతాధికారులు, గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## బ్లూ, గ్రీన్ సిటీగా హైదరాబాద్ అభివృద్ధి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న తెలంగాణ రైజింగ్ 2047 పాలసీ ద్వారా 2034 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఒక ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లడమే తమ ధ్యేయమని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరాలతో పోటీ పడేలా తీర్చిదిద్దుతున్నాం.'తెలంగాణ ప్రజా పాలన నిబంధనల సవరణ చట్టం' బిల్లును కూడా శాసనసభ ఆమోదం తెలిపింది.

వ్యాపార రంగానికి మరింత ఊతమిచ్చేలా, చిన్నపాటి సాంకేతికపరమైన 400 రకాల నేరాలను నేరపూరిత పరిధి నుంచి తొలగించేందుకు ఈ బిల్లును ప్రవేశపెట్టినట్లు శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రంలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' మరింత సులభతరం అవుతుందని, అనవసర కోర్టు కేసులతో ఇబ్బందులు పడుతున్న చిన్న వ్యాపారాలకు ఇది ఎంతో ఊరట లభిస్తుందని చెప్పుకొచ్చారు. కొత్త చట్టాలపై త్వరలోనే జిల్లా కలెక్టర్లకు, వ్యాపార వర్గాలకు సమగ్ర అవగాహన కల్పిస్తామని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

# పరస్పరం పాఠాలు నేర్చుకుని ముందుకు సాగుదాం

భారతదేశ బ్రిక్స్ అధ్యక్షతన చైనా నుంచి లభించిన మద్దతు, సహకారానికి నా కృతజ్ఞతలు తెలుపుతున్నాను. మన ద్వైపాక్షిక సహకారం గురించి చర్చించే అవకాశం ఇప్పుడు మనకు లభించింది. భారతదేశానికి మీకు మరొకసారి సుస్వాగతం" అని చైనా అధ్యక్షుడి ప్రసంగానికి ప్రధాని మోదీ ధన్యవాదాలు తెలిపారు.

### షీ జిన్‌పింగ్ వ్యాఖ్యలు

"నా పుట్టినరోజైన జూన్ 15న మీరు ఫోన్ చేసి ఆహ్వానించారు మనం ఇప్పటివరకు 21 సార్లు కలుసుకున్నాం, అనేక కీలక అంశాలపై ఏకాభిప్రాయ సాధన దిశగా అడుగులు వేశాం. ఇవి చైనా-భారత్ సంబంధాలను స్థిరమైన అభివృద్ధి మార్గంలో నడిపించాయి. చైనా ఎప్పుడూ భారత్‌తో తన సంబంధాలను వ్యూహాత్మక, సుదీర్ఘ దృక్పథంతోనే వీక్షిస్తూ బలోపేతం చేసుకుంటోంది. మన రెండు దేశాల పరిస్థితులు వేరైనప్పటికీ, ఒకరి బలాలు, అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుంటూ, ఒకరికొకరు మద్దతుగా నిలుస్తూ విజయం సాధించవచ్చు" అని తెలిపారు."గత శతాబ్దంలో ఎన్నడూ చూడని తీవ్రమైన మార్పులు, అపూర్వమైన మహమ్మారి సమయాల్లో ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన రెండు దేశాలుగా 'గ్లోబల్ సౌత్'లోని కీలక సభ్యులుగా చైనా-భారత్‌లపై గురుతర బాధ్యత ఉంది. ఇరుదేశాలు మానవాళి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, మన ప్రజల సంక్షేమాన్ని కోరుకుంటూ, అగ్రదేశాలుగా తమ పాత్రను సమర్థవంతంగా పోషించాలి, మనం సమానత్వంతో కూడిన, క్రమబద్ధమైన బహుళ ధ్రువ ప్రపంచాన్ని ఆకాంక్షించాలి. స్వప్రయోజనాల కోసం కాకుండా ప్రపంచ శాంతి, స్థిరత్వం, అభివృద్ధి, సమృద్ధి కోసం మరింత సానుకూల శక్తిని అందించాలి" అని పిలుపునిచ్చారు.ఈ ద్వైపాక్షిక భేటీలో ఇరువురు నేతలు రెండు దేశాల సంబంధాలపై సమగ్ర సమీక్ష జరిపి, సహకారాన్ని మరింత విస్తరించేందుకు కొత్త చర్యలను పరిశీలిస్తారని భావిస్తున్నారు. ఈ చర్చల్లో ప్రధానంగా ఇరుదేశాల సరిహద్దు రేఖ అయిన వాస్తవాధీన రేఖ అంశమే ప్రధానంగా చర్చకు రానుంది. సరిహద్దులో శాంతి, ప్రశాంతత నెలకొంటేనే ఇతర సంబంధాలు ముందుకు సాగుతాయని భారత్ ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేసింది. అయితే సరిహద్దు వివాదాన్ని ద్వైపాక్షిక సంబంధాల్లోని ఇతర అంశాల నుంచి వేరుగా చూడాలని చైనా వాదిస్తూ వస్తోంది.ఇరుదేశాల ఉన్నతాధికారుల మధ్య జరిగిన కీలక చర్చల తర్వాత మోదీ-జిన్‌పింగ్‌ల భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. గత నెల చివర్లో బీజింగ్‌లో భారత జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో 'ప్రత్యేక ప్రతినిధుల' స్థాయి చర్చలు జరిపారు. 3,488 కిలోమీటర్ల సరిహద్దు వివాదానికి పరిష్కారం కనుగొనేందుకు 2003లో ఏర్పాటు చేసిన ఈ వ్యవస్థ ద్వారా ఎల్ఏసీ వెంట శాంతి పరిరక్షణ, సరిహద్దుల గుర్తింపు, సహకారంపై వారు విస్తృతంగా చర్చించారు.

# మిషన్ మోడ్‌లో ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ పనులు

ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్టు పురోగతితో పాటు రక్షణ, పౌర విమానయాన అవసరాలను సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లడంపై చర్చించారు. ప్రాజెక్టు పనులను ఇకపై మిషన్ మోడ్‌లో చేపట్టాలని నిర్ణయించినట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు.ప్రాజెక్టు అమలులో జాప్యం లేకుండా చూడటానికి రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్కో నోడల్ అధికారిని వచ్చే వారంలోగా నియమించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ అధికారులు 3 విభాగాల మధ్య సమన్వయం చేస్తూ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రక్రియలను వేగవంతం చేయనున్నారు. అదేవిధంగా జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్‌కు సంబంధించిన డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్), మాస్టర్ ప్లాన్ తయారీ ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు కిషన్ రెడ్డి తెలిపారు.ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు సంబంధించి రక్షణ, పౌర విమానయాన శాఖల అధికారులు ఇప్పటికే స్థలాన్ని పరిశీలించారు. ఏప్రిల్ 17వ తేదీన అధికారులు ప్రదేశాన్ని పరిశీలించిన సందర్భంగా సుమారు 2.75 కిలోమీటర్ల పొడవైన రన్‌వే అవసరమని ప్రాథమికంగా నిర్ణయించినట్లు కిషన్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం భారత వైమానిక దళం (ఐఏఎఫ్) ఆధీనంలో ఉన్న 369.45 ఎకరాల భూమికి అదనంగా మరో 1500 ఎకరాల భూమిని తెలంగాణ ప్రభుత్వం సేకరించాల్సి ఉంటుంది. ఈ అదనపు భూమిలో ఎయిర్‌పోర్టు, ఎయిర్‌ఫోర్స్ కార్యకలాపాలకు అవసరమైన వివిధ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయనున్నారు.ప్రతిపాదిత జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్‌లో ట్రైనర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లకు అవసరమైన సదుపాయాలు, విజిటింగ్ ఎయిర్‌క్రాఫ్ట్ పార్కింగ్, వెదర్ షెల్టర్లు, ఎయిర్‌క్రాఫ్ట్ హ్యాంగర్లు ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఆపరేషనల్ కాంప్లెక్స్, ట్రైనింగ్ సదుపాయాలు, విమానాల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులను కూడా అభివృద్ధి చేయనున్నారు.దీంతో ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు కేవలం పౌర విమానాల రాకపోకలకు మాత్రమే పరిమితం కాకుండా రక్షణ అవసరాలకు కూడా ఉపయోగపడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ ప్రాజెక్టుకు వ్యూహాత్మక ప్రాధాన్యత ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. పౌర విమానయానానికి సంబంధించిన మౌలిక వసతులపైనా సమావేశంలో నిర్ణయాలు తీసుకున్నారు. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఆధ్వర్యంలో ఆధునిక సివిల్ టెర్మినల్ ఏర్పాటు చేయనున్నారు.అదేవిధంగా విమానాల నిర్వహణ, మరమ్మతు కార్యకలాపాలకు ఉపయోగపడే మెయింటెనెన్స్, రిపేర్ అండ్ ఓవర్‌హాల్ (ఎంఆర్ఓ) ఫెసిలిటీని కూడా ఏర్పాటు చేసే ప్రణాళిక ఉంది. ఎయిర్‌ఫోర్స్ సిబ్బందికి అవసరమైన నివాస, ఇతర మౌలిక సదుపాయాలను కూడా ప్రాజెక్టులో భాగంగా అభివృద్ధి చేయనున్నారు. ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు ఏర్పాటుతో ఉత్తర తెలంగాణలో విమాన కనెక్టివిటీ మెరుగుపడుతుందని కిషన్ రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ ప్రాంతానికి వాణిజ్యపరమైన ప్రాధాన్యతతో పాటు దేశ రక్షణ పరంగా కూడా ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు.రీజినల్ కనెక్టివిటీ అవసరాన్ని కేంద్ర రక్షణ, పౌర విమానయాన మంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్లు కిషన్ రెడ్డి చెప్పారు. ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు అభివృద్ధికి రక్షణ మంత్రిత్వ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని రాజ్‌నాథ్ సింగ్ హామీ ఇచ్చినట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ కోసం గత కొంతకాలంగా కేంద్ర, రాష్ట్ర స్థాయిలో వరుస సమావేశాలు, లేఖలు, అధికారుల మధ్య సమన్వయం కొనసాగుతున్నట్లు కిషన్ రెడ్డి తెలిపారు. ఇప్పుడు ప్రాజెక్టును వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు నోడల్ అధికారుల నియామకం, డీపీఆర్, మాస్టర్ ప్లాన్ ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయించడం కీలక పరిణామంగా మారింది.

# ధరణి పేరుతో బీఆర్ఎస్ భూదందా

ఎంతోమంది త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న తెలంగాణను గత పాలకులు తమ స్వప్రయోజనాల కోసం వాడుకున్నారని.. బిఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబం, వారి బంధువులు మాత్రమే బాగుపడ్డారని మంత్రి పొంగులేటి ఆరోపించారు.

### అక్రమాల కోసం కేసీఆర్ వద్దే రెవెన్యూ శాఖ

రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత భూముల అక్రమాలకు పాల్పడేందుకే కేసీఆర్ రెవెన్యూ శాఖను తన వద్దే ఉంచుకున్నారని మంత్రి విమర్శించారు. రాష్ట్రంలోని 2.49 కోట్ల ఎకరాల భూమిని తమ సొంత ఆస్తిలా భావించి, దివాళా తీసిన ఒక విదేశీ సంస్థకు ధరణి పోర్టల్ నిర్వహణ బాధ్యతలను అప్పగించారని పొంగులేటి విమర్శించారు. ధరణి పోర్టల్ పేరుతో లక్షలాది ఎకరాల్ని తమ గుప్పిట్లో పెట్టుకుని అర్ధరాత్రి వేళల్లో అక్రమ రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని దుయ్యబట్టారు. ధరణి పోర్టల్‌లో దొర్లిన తప్పుల కారణంగా రాష్ట్రంలో లక్షలాది మంది రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చిందన్నారు. తమ భూమి పోయిందని మనస్తాపంతో వందలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూ సమస్యలకు సర్వేనే ఫైనల్ పరిష్కారమని భావించి వాటిని పరిష్కరించాం. సర్వేతోనే గెట్టు పంచాయతీలు పరిష్కారం అవుతాయి. 125 ఏళ్ల తరువాత సెంటు భూమి కూడా వదలకుండా పూర్తి స్థాయిలో సర్వే చేస్తున్నాం. మనిషికి ఆధార్ కార్డుల్లాగా.. రాష్ట్రంలో భూములకు భూధార్ కార్డులు తీసుకొచ్చాం. ఈ భూధార్ కార్డు అనేది ప్రతి భూమి (భూకమతానికి) కేటాయించే ఒక ప్రత్యేకమైన గుర్తింపు సంఖ్య, ఇది డిజిటల్ మ్యాప్‌తో కూడిన కార్డు. కేసీఆర్ ప్రభుత్వం లాగ భూముల్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించకుండా ప్రభుత్వమే సర్వే చేపట్టి భూ రికార్డులు ప్రక్షాళన చేసింది. వీఆర్వో, వీఆర్ఏలను గ్రామ పాలన అధికారులుగా, విద్యార్హతలను బట్టి ఇతర శాఖల్లోకి బదిలీ చేసి వారికి ఉద్యోగ భద్రత కల్పించామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించారు.

# నైతికత కోల్పోయిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

**- ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి**

**హైదరాబాద్** బిఆర్ఎస్ మాక్ అసెంబ్లీపై ఎంపీ చామల కిరణ్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలతో కేసీఆర్ ఒక రోజు ముందు ఎల్పీ మీటింగ్ పెట్టి పంచాయతీ పెట్టుకుని రండి అని చెప్పారు. ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్,బిఆర్ఎస్ ఎమ్మెల్యేలకు అసెంబ్లీకి వచ్చి ప్రశ్నించే నైతికత కోల్పోయారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను కేసీఆర్ ఉసిగొల్పారు. నల్ల టీ షర్టుల పైన పేర్లు రాసుకుని రాకుండా అసెంబ్లీకి వచ్చి ప్రశ్నించవచ్చు కదా. నల్ల టీ షర్టులపై పేర్లు రాసుకుని వస్తే లోపలకు రానివ్వరని బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు భావించారు.

అసెంబ్లీ గేటు వద్దకు వచ్చి పోలీసులతో పంచాయతీ పెట్టుకున్నారు. దళితులను,స్పీకర్ ను బిఆర్ఎస్ పార్టీ అవమానించింది. మాక్ అసెంబ్లీ పెట్టి సీఎం, మంత్రులను ఇష్టం వచ్చినట్లు తిట్టారు. మాక్ అసెంబ్లీలో వెకిలి చేష్టలు చేశారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు సురభి నాటకంలో జాయిన్ కావాలి. బిఆర్ఎస్ వాళ్ళకు అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడే ఆలోచన లేదని అన్నారు.అందుకే దసరా వస్తుంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు నాటకాలు,రికార్డింగ్ డ్యాన్సులకు వెళ్ళాలి. వినాయక చవితి,దసరా,దీపావళి ఉత్సవాలకు బిఆర్ఎస్ ఎమ్మెల్యేల అవసరం ఉంది. సంక్రాంతికి బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఏపీకి పంపిస్తాము. బిఆర్ఎస్ వాళ్ళను ప్రజలు బఫున్లలా చూస్తున్నారని అన్నారు.

# జనవరి 1 నుంచి హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్

నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో జనవరి 1వ తేదీ నుంచి ప్రజల ఆరోగ్య రికార్డులను పూర్తిగా డిజిటలైజ్ చేస్తున్నామని, ఇది వైద్య రంగంలో ఒక గేమ్‌చేంజర్‌గా నిలుస్తుందని ప్రకటించారు. అమరావతిలో ఏర్పాటు చేయనున్న క్వాంటం బయో వ్యాలీని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి, తగిన సహకారం అందించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వంతోనే రాష్ట్రంలో వైద్యారోగ్య రంగం కొత్త పుంతలు తొక్కుతోందని అన్నారు.శనివారం విజయవాడలో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు వైద్యారోగ్య శాఖకు చెందిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. తొలుత విజయవాడ పాత ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన క్రిటికల్ కేర్ బ్లాక్, ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబరేటరీని వారు సందర్శించి ప్రారంభించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో జరిగిన సభలో రాష్ట్రవ్యాప్తంగా రూ.249 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన 10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబొరేటరీలను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అదనంగా 500 క్రిటికల్ కేర్ బెడ్లు అందుబాటులోకి వచ్చాయి. వీటితో పాటు అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, అల్ట్రాసౌండ్, కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ వంటి సూపర్ స్పెషాలిటీ సేవలు కూడా ప్రజలకు చేరువ కానున్నాయి.

### డబుల్ ఇంజన్ ప్రభుత్వంతో అభివృద్ధి పరుగులు

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఏర్పడిన డబుల్ ఇంజన్ ప్రభుత్వం వల్లే రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని అన్నారు. గత 12 ఏళ్లలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని కొనియాడారు. దేశంలో మెడికల్ సీట్లను 51 వేల నుంచి రెట్టింపు చేశారని, కోవిడ్ సమయంలో ప్రపంచానికే వ్యాక్సిన్ అందించి భారత్ సత్తా చాటారని గుర్తుచేశారు. మంగళగిరి ఎయిమ్స్‌ను అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారని, జన ఔషధి కేంద్రాల ద్వారా పేదలకు తక్కువ ధరకే మందులు అందుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఫార్మా రంగం దేశానికే తలమానికంగా ఉందని, మెడ్‌టెక్ పార్కు ద్వారా వైద్య పరికరాల ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నామని వివరించారు.

### ఆరోగ్యకర సమాజ నిర్మాణమే ధ్యేయం

ఆహారపు అలవాట్లను మార్చుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సీఎం సూచించారు. "వంటశాలనే ఫార్మసీగా, ఆహారాన్నే ఔషధంగా" భావించాలని పిలుపునిచ్చారు. యోగా, ప్రాణాయామం వంటి సంప్రదాయ పద్ధతులను పాటిస్తూనే, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు. వైద్యారోగ్య రంగానికి నిధులు కేటాయిస్తున్న ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర సహకారం, రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం, ప్రజల భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే నంబర్-1 స్థానంలో నిలుపుతామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. 'హెల్తీ-వెల్తీ-హ్యాపీ ఆంధ్రప్రదేశ్' నిర్మాణమే తమ ప్రభుత్వ ధ్యేయమని పునరుద్ఘాటించారు.

### అమరావతి.. భవిష్యత్ టెక్నాలజీ హబ్

అమరావతిని భవిష్యత్ సాంకేతికతకు చిరునామాగా తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు వివరించారు. దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్‌ను అమరావతిలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అమరావతి గురించి లద్దాఖ్‌లో కూడా చర్చించుకునే పరిస్థితి వచ్చిందని, భవిష్యత్తులో ప్రపంచమంతా అమరావతి వైపు చూస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బోండా ఉమ, సోము వీర్రాజు సహా పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సీఎం ప్రసంగం సందర్భంగా ప్రధాని మోదీ, అమరావతి, సంజీవని ప్రాజెక్టుల గురించి ప్రస్తావించినప్పుడు సభికులు, వైద్య విద్యార్థులు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమం ముగిశాక సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి నడ్డాతో కలిసి వేదికపై నుంచే సెల్ఫీ తీసుకుని సభికులను ఉత్సాహపరిచారు

# బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 'మాక్ అసెంబ్లీ'

వ్యాఖ్యానించారు. సీఎం బూతుల ప్రభావం ఎక్కువైందంటూ సెటైర్ వేశారు.

### 40 శాతం కమీషన్ తీసుకుంటే తప్పేంటి.?

మేడిగడ్డను రిపేర్ చేయించమని, తమ్మిడిహట్టి ప్రాజెక్టును 2004లోనే నిర్మించాలని అనుకున్నామని పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మహారాష్ట్రలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నప్పటికీ అనుమతి ఇవ్వడంటూ సైటర్ వేశారు. మరో 10 ఏళ్లు ఆలస్యమైన తమ్మిడిహట్టి ప్రాజెక్టును నిర్మిస్తామని పేర్కొన్నారు. కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీ సమావేశాల్లో సలహాదారుడు ఆదిత్యనాథ్ దాస్ ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ సంతకం పెడతానని ఇరిగేషన్ మంత్రి పాత్రలో పల్లా మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడానికి చంద్రబాబు కారణమని, ఆయన రుణం తీర్చుకోవద్దా? అంటూ వ్యంగ్యంగా విమర్శించారు. కర్ణాటకలో 40 శాతం కమీషన్ తీసుకుంటే, తెలంగాణలో 30 శాతం కమీషన్ తీసుకుంటున్నామని, అందులో తప్పేముందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి పల్లా సెటైర్ వేశారు. కాంగ్రెస్ అంటేనే ఫ్యామిలీ కూటమి అన్నారు.

### @ 100 రోజులో చెప్పామా.?

ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులలో ఒకటైన కాళేశ్వరంను ఇందిరాగాంధీ నిర్మించారని చెప్పడంతో తలసాని శ్రీనివాస్ మాక్ అసెంబ్లీలో నవ్వులు పూయించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని, కానీ ఏ 100 రోజులో అమలు చేస్తామని చెప్పలేదు కదా అంటూ సెటైర్లు వేశారు. మాక్ అసెంబ్లీలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సీఎం పాత్ర పోషించారు. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు స్పీకర్‌గా వ్యవహరించారు.

### 25 ఏళ్లు మేమే అధికారంలో

"100 రోజుల్లో హామీలు అమలు చేస్తామన్నాం. కానీ @ 100 రోజుల్లో అని చెప్పామా? 5 ఏళ్లు కాదు, 25 ఏళ్లు మేమే అధికారంలో ఉంటాం. ఎప్పుడో ఒకప్పుడు ఆ హామీలు అమలు చేస్తాం" అంటూ మాక్ అసెంబ్లీలో తలసాని శ్రీనివాస్ యాదవ్ వ్యంగ్యంగా మాట్లాడారు. సభలో సభ్యులు సబ్జెక్ట్ తప్ప ఏమైనా మాట్లాడుకోవచ్చన్నారు. తనకు చాలా సమస్యలు ఉన్నాయంటూ ఢిల్లీతో సమస్య, పార్టీలో సమస్య, ఆఖరికి బీఆర్ఎస్‌తో కూడా ప్రశాంతత లేదంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

# నిరుద్యోగులకు టీజీపీఎస్సీ బిగ్ షాక్

ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్ పోస్టుల భర్తీకి సంబంధించి 2022లో జారీ చేసిన బ్రీఫ్ నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. మొత్తం 544 ఖాళీల భర్తీకి ఇచ్చిన ఈ నోటిఫికేషన్‌ను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు కమిషన్ వెబ్‌నోట్ ద్వారా వెల్లడించింది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 2022 డిసెంబర్ 31వ తేదీన కాలేజియేట్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లోని అసిస్టెంట్ ప్రొఫెసర్లు (లెక్చరర్లు), ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్ పోస్టుల భర్తీ కోసం బ్రీఫ్ నోటిఫికేషన్ నంబర్ 33/2022ను విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా మొత్తం 544 ఖాళీలను భర్తీ చేయాలని నిర్ణయించారు.అయితే ఈ నోటిఫికేషన్‌కు సంబంధించిన వివిధ అంశాలపై కమిషన్ సుదీర్ఘంగా చర్చించింది.

అన్ని పరిస్థితులను సమగ్రంగా పరిశీలించిన తర్వాత 33/2022 బ్రీఫ్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని నిర్ణయించినట్లు తాజాగా టీజీపీఎస్సీ ప్రకటించింది. పాత నోటిఫికేషన్ రద్దు కావడంతో ఈ పోస్టుల భర్తీకి కొత్త నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. కొత్త నోటిఫికేషన్‌ను ప్రస్తుత నిబంధనలు, రోస్టర్ పాయింట్లు, రిజర్వేషన్ విధానాలకు అనుగుణంగా రూపొందించే అవకాశం ఉంది.కమిషన్ వెబ్‌నోట్ ప్రకారం 2022 డిసెంబర్ 31వ తేదీన జారీ చేసిన బ్రీఫ్ నోటిఫికేషన్ నంబర్ 33/2022ను తక్షణమే రద్దు చేశారు. 544 ఖాళీలకు సంబంధించిన ఈ నోటిఫికేషన్ ఇక చెల్లుబాటు కాదని అభ్యర్థులు గుర్తించాలని కమిషన్ సూచించింది.

పాత నోటిఫికేషన్ రద్దు కావడంతో గతంలో జారీ చేసిన బ్రీఫ్ నోటిఫికేషన్ ఆధారంగా నియామక ప్రక్రియ కొనసాగదని అభ్యర్థులు గమనించాలి.కొత్త నోటిఫికేషన్ విడుదలైన తర్వాత అందులో పేర్కొనే పోస్టుల సంఖ్య, అర్హతలు, వయోపరిమితి, రిజర్వేషన్లు, దరఖాస్తు తేదీలు, ఎంపిక విధానం వంటి వివరాలను అభ్యర్థులు తప్పనిసరిగా పరిశీలించాలి. కొత్త నోటిఫికేషన్‌ను త్వరలోనే విడుదల చేయనున్నట్లు టీజీపీఎస్సీ తన వెబ్‌నోట్‌లో పేర్కొంది. దీంతో డిగ్రీ కాలేజీ లెక్చరర్, ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్ పోస్టుల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు కొత్త ప్రకటన కోసం వేచి చూడాల్సి ఉంటుంది.

# ముఖ్యమంత్రిశ్రీ చంద్రబాబు నాయుడుకు శ్రీవారి బ్రహ్మోత్సవాల ఆహ్వానం

**- ఆహ్వాన పత్రిక అందజేసిన టీటీడీ ఛైర్మన్, ఈవో**

**తిరుమల,** తిరుమల శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును టీటీడీ ఘనంగా ఆహ్వానించింది. ఈ మేరకు అమరావతిలోని ముఖ్యమంత్రి నివాసంలో టీటీడీ బోర్డు ఛైర్మన్ బీఆర్ నాయుడు, బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, పనబాక లక్ష్మీ, జానకిదేవి, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి శ్రీవారి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా టీటీడీ వేద పండితులు ముఖ్యమంత్రికి వేదాశీర్వచనం అందించారు. అనంతరం శ్రీవారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు చేపడుతున్న ఏర్పాట్లు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, భద్రతా చర్యలు తదితర అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టీటీడీ ఛైర్మన్, ఈవోలతో చర్చించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ వేద పండితులు, అర్చకులు, పలువురు అధికారులు పాల్గొన్నారు. టీటీడీ ముఖ్య ప్రజా సంబంధాల అధికారిచే విడుదల చేయబడినది.

# మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో ఎదురుదెబ్బ

మూసీ ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన పర్యావరణ అనుమతులను సవాల్ చేస్తూ, చెన్నైలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సౌత్ బెంచ్‌ను ఆశ్రయించిన రిటైర్డ్ ఇంజినీర్లుమూసీ పరివాహక ప్రాంతం మొత్తం 55 కిలోమీటర్లు ఉంటే ప్రభుత్వం కేవలం 20 కిలోమీటర్లు మాత్రమే పరిశీలించిందిఅలాగే ఇదే రీజియన్‌లో మృగవాణి నేషనల్ పార్క్ కూడా ఉందిఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ చెరువుల పక్కన భారీ నిర్మాణాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ పిటిషన్ వేసిన రిటైర్డ్ ఇంజినీర్లుఈ పిటిషన్‌ను పరిశీలించి, పర్యావరణ అనుమతుల జారీ, ప్రాజెక్టు అమలుకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం తన వాదనలను, సంబంధిత వివరాలను తమకు వెంటనే అందజేయాలని నోటీసులు జారీ చేసిన చెన్నై ఎన్జీటీ బెంచ్‌తదుపరి విచారణ వచ్చే నెల 16కు వాయిదా

# ఏపీలో 500 క్రిటికల్ కేర్ బెడ్లు

**విజయవాడ:** ఆంధ్రప్రదేశ్‌లో వైద్య మౌలిక సదుపాయాలను బలోపేతం చేసే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కీలక ముందడుగు వేశాయి. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం విజయవాడలో పర్యటించి, రాష్ట్రవ్యాప్తంగా రూ.249 కోట్ల వ్యయంతో నిర్మించిన 22 ఆరోగ్య ప్రాజెక్టులను సంయుక్తంగా ప్రారంభించారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతోనే ఇలాంటి అభివృద్ధి సాధ్యమని ఈ సందర్భంగా నేతలు స్పష్టం చేశారు. పేద, మధ్యతరగతి ప్రజలకు అత్యవసర, అత్యాధునిక వైద్యం అందించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టులను అందుబాటులోకి తెచ్చారు. విజయవాడ పాత ప్రభుత్వాస్పత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన క్రిటికల్ కేర్ బ్లాక్, ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ (ఐపీహెచ్) ల్యాబొరేటరీలను నడ్డా, చంద్రబాబు నేరుగా ప్రారంభించి, అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 ఐపీహెచ్ ల్యాబ్‌లను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 500 క్రిటికల్ కేర్ బెడ్లతో పాటు అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ వంటి సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. డబుల్ ఇంజిన్ సర్కార్ వల్లే రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని అన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి నడ్డా సహకారంతో రాష్ట్ర వైద్య రంగాన్ని బలోపేతం చేస్తున్నామని తెలిపారు. "త్వరలోనే రాష్ట్రంలో 'సంజీవని' ప్రాజెక్టును ప్రారంభించబోతున్నాం. ఇది వైద్య రంగంలో ఒక గేమ్ ఛేంజర్ కానుంది. జనవరి 1 నుంచి ప్రజల ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేస్తాం" అని చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. అమరావతికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వస్తోందని, లడ్డాఖ్‌లో కూడా అమరావతి గురించి చర్చించుకుంటున్నారని చంద్రబాబు పేర్కొన్నారు. "అమరావతిలో ఏర్పాటు చేయనున్న 'బయో క్వాంటం వ్యాలీ'కి జాతీయ గుర్తింపు ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతున్నాను. దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్ అమరావతిలో ప్రారంభం కానుంది" అని కేంద్ర మంత్రి నడ్డాను అభ్యర్థించారు. ఆహారమే ఔషధంగా 'కిచెన్ ఫార్మసీ'ని ప్రోత్సహించాలని, ప్రతి ఒక్కరూ యోగా, ధ్యానం అలవర్చుకోవాలని సూచించారు. కేంద్రం సహకారం, రాష్ట్ర సంకల్పం, ప్రజల భాగస్వామ్యంతో ఏపీని 'హెల్తీ-వెల్తీ-హ్యాపీ ఆంధ్రప్రదేశ్'గా తీర్చిదిద్దుతామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

# సాలకట్ల బ్రహ్మోత్సవాలు

**- నవరాత్రి ఉత్సవాల ప్రత్యేక బులెటిన్ విడుదల చేసిన టీటీడీ**

విజయవాడ : తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు రావాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఛైర్మన్ బీఆర్ నాయుడు అధికారికంగా ఆహ్వానించారు. అమరావతి సమీపంలోని ఉండవల్లి వద్ద గల సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రిని టీటీడీ ఛైర్మన్, ఈవోలతో పాటు బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, పనబాక లక్ష్మి, జానకీదేవి కలసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా టీటీడీ వేద పండితులు సీఎం చంద్రబాబుకు మంత్రోచ్చారణల నడుమ వేదాశీర్వచనం అందించి, స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలను బహూకరించారు. అనంతరం తిరుమలలో త్వరలో ప్రారంభం కానున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల ముందస్తు ఏర్పాట్లపై టీటీడీ నాయకత్వంతో ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా దేశ విదేశాల నుంచి విచ్చేసే సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు, అన్నప్రసాద వితరణ, లడ్డూ ప్రసాదాల నిల్వ, భద్రత మరియు పారిశుధ్య నిర్వహణపై సీఎం దిశానిర్దేశం చేశారు. తిరుమలలో సాలకట్ల బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 15 నుంచి 23వ తేదీ వరకు వైభవంగా జరగనుండగా, ఆ తర్వాత నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 12 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించేందుకు టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఈ సాలకట్ల బ్రహ్మోత్సవాల వేళ స్వామివారు వివిధ అలంకారాల్లో చేసే వాహన సేవలు, విశేష ఉత్సవాలు, ముఖ్యమైన ఆధ్యాత్మిక కార్యక్రమాల సమయ వేళలను భక్తులకు తెలియజేసేందుకు ఇప్పటికే ప్రత్యేక బుక్‌లెట్‌ను టీటీడీ విడుదల చేసింది. ముఖ్యమంత్రి పట్టువస్త్రాల సమర్పణతో సహా గరుడ సేవ వంటి కీలక ఘట్టాల నిర్వహణకు దేవస్థానం సర్వం సిద్ధం చేస్తోంది.

# ఏపీలో భారీ వర్షాలు

**విజయవాడ :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో వర్ష బీభత్సం కనిపిస్తోంది. అల్లూరి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. రెండు రోజులుగా భారీ వర్షాలకు జీకే విధి మండలం దారకొండ పంచాయతీ చిన్న గంగవరం వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన వంతెన కొట్టుకుపోయింది. ఏపీ-ఒడిశా సరిహద్దులోని 15 గ్రామాలకు ఈ వంతెనపై నుంచే రాకపోకలు జరుగుతాయి. 2024లో భారీ వర్షాలకు వంతెన కొట్టుకుపోవడంతో తాత్కాలిక వంతెన నిర్మించారు. ప్రస్తుతం తాత్కాలిక వంతెన కూడా కొట్టుకుపోవడంతో 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బ్రిడ్జి లేకపోవడం వల్ల నిత్యావసర సరుకుల రవాణాతో పాటు అత్యవసర వైద్య సేవలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు.

వర్షాలు, వరదల కారణంగా రాకపోకలు నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామంటున్నారు. వెంటనే కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టి తమ సమస్యను పరిష్కరించాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. అల్పపీడనం ప్రభావంతో రాగల 6 గంటలు శ్రీకాకుళం నుంచి పల్నాడు వరకు వర్ష సూచన ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ శనివారం తెలిపింది. రాగల 2 గంటలు కోనసీమ, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, 60 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది.

# విశాఖ వాల్తేరు డిపో సమీపంలో ఘటన

**విశాఖపట్టణం :** విశాఖపట్నంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. నగరంలోని వాల్తేరు డిపో సమీపంలో నిలిపి ఉంచిన ఏపీఎస్ఆర్టీసీ బస్సు మంటల్లో చిక్కుకుని పూర్తిగా దగ్ధమైంది. శనివారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకోగా, ఆ సమయంలో బస్సులో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది.

వివరాల్లోకి వెళితే.. శుక్రవారం రాత్రి నెల్లూరు నుంచి ప్రయాణికులతో వచ్చిన ఈ బస్సును వాల్తేరు డిపో వద్ద నిలిపి ఉంచారు. అయితే, శనివారం తెల్లవారుజామున బస్సు ఇంజిన్ భాగం నుంచి అకస్మాత్తుగా పొగలు వెలువడ్డాయి. చూస్తుండగానే నిమిషాల వ్యవధిలోనే మంటలు బస్సు మొత్తానికి వేగంగా వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అయినప్పటికీ అప్పటికే బస్సు పూర్తిగా కాలిబూడిదైంది. ఈ ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. ప్రయాణికులు లేని సమయంలో ఈ ఘటన జరగడంతో పెను ముప్పు తప్పినట్లయిందని అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# అమల్లోకి అనలాగ్ పన్నీరు

**హైదరాబాద్ :** ప్రజారోగ్య పరిరక్షణ దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 'అనలాగ్' (కృత్రిమ) పన్నీర్‌పై నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిషేధం ఏడాది పాటు అమల్లో ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. పన్నీర్ పేరిట విక్రయిస్తున్న నాణ్యత లేని, కల్తీ ఉత్పత్తుల వల్ల ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతున్న నేపథ్యంలో ఈ కఠిన చర్యలు చేపట్టింది. పన్నీర్ పేరుతో చలామణి అవుతున్న డైరీయేతర, కృత్రిమ ఉత్పత్తుల తయారీ, ప్రాసెసింగ్, ప్యాకింగ్, నిల్వ, రవాణా, పంపిణీ మరియు విక్రయాలపై ఈ నిషేధం వర్తిస్తుంది. ఈ మేరకు రాష్ట్ర ఆహార భద్రతా విభాగం (టీజీ సేఫ్) ఉత్తర్వులు జారీ చేసింది. 2026 సెప్టెంబర్ 10వ తేదీ నుంచి ఈ ఆదేశాలు రాష్ట్రవ్యాప్తంగా తక్షణమే అమల్లోకి వచ్చాయి. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్, 2006లోని సెక్షన్ 30(2)(జీ) ప్రకారం ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ ఉత్తర్వులతో రాష్ట్రంలో కల్తీ పన్నీర్ తయారీ, విక్రయాలకు అడ్డుకట్ట పడనుంది.

# ప్రజ్వల్ ఫోన్‌లో పోర్న్ వీడియోలు

**బెంగళూరు** మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ జైలు గదిలో స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్‌లో వందలాది పోర్న్ వీడియోలు ఉన్నట్లు ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్) నిర్ధారించింది. మొత్తం 173 వీడియో ఫైళ్లు ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. వాటిలో ప్రజ్వల్‌కు సంబంధించినవిగా భావిస్తున్న మూడు అశ్లీల వీడియోలు ఉన్నట్లు సమాచారం. బెంగళూరు కేంద్ర కారాగారంలో ఆగస్టు 11న పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ప్రజ్వల్ రేవణ్ణ, మరో ఖైదీ ప్రతాప్ రాయ్ ఉంటున్న గదిలో మొబైల్ ఫోన్ దొరికింది. పాస్‌వర్డ్ చెప్పేందుకు ఇద్దరూ నిరాకరించడంతో ఫోన్‌ను ఎఫ్ఎస్ఎల్‌కు పంపారు. తాజాగా వచ్చిన నివేదికలో వీడియో ఫైళ్లు ఉన్నట్లు నిర్ధారణ అయింది. మొబైల్‌లో కన్నడ, హిందీ, ఇంగ్లిష్ సినిమాల క్లిప్పులు, వెబ్‌సిరీస్ వీడియోలు కూడా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పెన్‌డ్రైవ్‌లోనూ 150కి పైగా వీడియోలు ఉన్నట్లు వెల్లడైంది. వాటినీ అధికారులు పరిశీలిస్తున్నారు. ఫోన్‌లో వాట్సాప్, వీడియో కాల్స్ జరిగినట్లు కాల్ రికార్డుల పరిశీలనలో తేలింది. పలువురు మహిళలతో సంప్రదింపులు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ప్రజ్వల్‌తో గతంలో కొన్ని వీడియోల్లో కనిపించిన కొందరు మహిళలతో జరిగిన కాల్స్‌పై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. అవసరమైతే వారికి నోటీసులు ఇచ్చి ప్రశ్నించే అవకాశం ఉంది. జైలులో ఉన్న సమయంలో ప్రజ్వల్ కుటుంబ సభ్యులతో తరచూ మాట్లాడినట్లు దర్యాప్తులో తేలింది. తన న్యాయవాదితోనూ ఫోన్‌లో సంప్రదింపులు జరిపినట్లు పోలీసులు గుర్తించారు. ఇక హైసెక్యూరిటీ జైలులోకి ఫోన్ ఎలా చేరిందన్న కోణంలోనూ దర్యాప్తు సాగుతోంది. ఓ జైలు వార్డర్ ప్రజ్వల్‌కు ఫోన్ అందించినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. తౌసీఫ్ అనే రౌడీషీటర్ పాత్రపైనా పోలీసులు ఆరా తీస్తున్నారు. డిజిటల్ ఆధారాలు, కాల్ రికార్డులు, జైలు సిబ్బంది వాంగ్మూలాలతో దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

# గణేష్ చతుర్థి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

**- పోలీసుల సూచనలు పాటిస్తూ భక్తిశ్రద్ధలతో వేడుకలు జరుపుకోవాలి**

**- మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి..**

**- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు**



**సి. బెళగల్,** గణేష్ చతుర్థి ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించాలని సి. బెళగల్ సి.ఐ. సూచించారు. గణేష్ విగ్రహాల ప్రతిష్ఠాపన, పూజా కార్యక్రమాలు, ఊరేగింపులు, నిమజ్జనం సందర్భంగా భద్రతా ప్రమాణాలు, ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు సి. బెళగల్ పోలీస్ స్టేషన్‌లో గణేష్ ఉత్సవాల నిర్వహణపై శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సి.ఐ. తబ్రేజ్, సి. బెళగల్ ఎస్.ఐ. వేణుగోపాల్ రాజులు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలకు పలు కీలక సూచనలు చేశారు. ఉత్సవాల ప్రారంభం నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకునిర్వాహకులు పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని కోరారు.
**అనుమతులు తీసుకున్న తర్వాతే మండపాల ఏర్పాటు** గణేష్ విగ్రహాల ప్రతిష్ఠాపనకు ముందు సంబంధిత అధికారుల నుంచి అవసరమైన అనుమతులు తీసుకోవాలని పోలీసులు సూచించారు. మండపాలను ఏర్పాటు చేసే సమయంలో ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రహదారులను పూర్తిగా ఆక్రమించేలా మండపాలు ఏర్పాటు చేయకుండా, అత్యవసర వాహనాలు సైతం సులభంగా వెళ్లే విధంగా మార్గం అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు.
**విద్యుత్, అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత** గణేష్ మండపాల వద్ద విద్యుత్ భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులు సూచించారు. విద్యుత్ వైర్లు, కనెక్షన్లు నిర్లక్ష్యంగా ఏర్పాటు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. షార్ట్‌సర్క్యూట్, అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు.
**డీజేలు, అధిక శబ్దంపై నిబంధనలు తప్పనిసరి** ఉత్సవాల సందర్భంగా శబ్ద కాలుష్య నియంత్రణ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని పోలీసులు స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా డీజేలు, అధిక శబ్దంతో సౌండ్ సిస్టమ్‌లు వినియోగించరాదని హెచ్చరించారు. ఉత్సవాల పేరుతో గొడవలు, ఘర్షణలు, అసభ్య ప్రవర్తన లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# నీటి ఎక్స్‌పైరీ డేట్ ఎంతో తెలుసా?

**- డాక్టర్. ఎండి డి.సి.తిరుపతిరావు సీనియర్ వైద్యులు: చైతన్య హాస్పిటల్**

**కరీంనగర్**డాక్టర్. ఎండి డి.సి.తిరుపతిరావు సీనియర్ వైద్యులు: చైతన్య హాస్పిటల్ కరీంనగర్ మాట్లాడుతూ ఒక రోజు పాత నీటిని కొందరు పారబోస్తారుఒక వారం పాత నీటిని మరికొందరు తాగుతారు. కానీ వేల సంవత్సరాల క్రితం భూమిలో నిల్వైన నీటిని మాత్రం మనం అత్యంత స్వచ్ఛమైనదిగా భావిస్తాం! అయితే అసలు నీటి ఎక్స్‌పైరీ డేట్ ఎంత? ఈ ప్రశ్నకు సమాధానం తెలుసుకుంటే: నీటి గురించి మీ ఆలోచనే మారిపోవచ్చుచాలాసార్లు మనం మన సౌకర్యాన్ని బట్టి, మన ఆలోచనా విధానాన్ని బట్టి నీటికి ఒక "ఎక్స్‌పైరీ డేట్" నిర్ణయించేస్తుంటాం. కానీ నిజానికి దీనికి ఎలాంటి శాస్త్రీయ ఆధారమూ లేదు. ఒకసారి మన చుట్టూ జరుగుతున్న ఈ విచిత్రమైన పరిస్థితులను గమనించండి. నగరాల్లో: ఎక్కడైతే ప్రతిరోజూ మున్సిపల్ పంపుల్లో నీళ్లు వస్తాయో, అక్కడ నిన్నటి నీటిని "పాసిపోయాయి" అనుకుంటూ పారబోసేస్తారు. వీరి లెక్కలో ఎక్స్‌పైరీ డేట్: కేవలం 1 రోజు. నీళ్లు వారానికి ఒకసారే వచ్చే ప్రాంతాల్లోఅదే నీరు రెండు నుండి ఎనిమిది రోజుల పాటు అచ్చం ఫ్రెష్‌గా, తాగడానికి వీలుగానే ఉంటుంది. ఎవరూ పారబోయరు. వీరి లెక్కలో ఎక్స్‌పైరీ డేట్ 2 నుండి 8 రోజులు. పెళ్లిళ్లు, శుభకార్యాల్లో: టేబుల్ మీద కొత్త బిస్లరీ బాటిల్ ఓపెన్ చేయగానే, పక్కనే ఉన్న పాత బాటిల్‌ను పనికిరానిదిగా చూస్తూ అక్కడే వదిలేస్తారు లేదా పారేస్తారు. వీరి లెక్కలో ఎక్స్‌పైరీ డేట్ కొన్ని నిమిషాలు లేదా గంటలు మాత్రమేకానీ అసలు నిజం ఇంకోలా ఉంది..ఎడారిలోప్రయాణం చేసేటప్పుడు, తదుపరి నీటి వనరు దొరికే వరకు ప్రతి ఒక్క నీటి చుక్కా ఎంతో విలువైనదిగా, ఫ్రెష్‌గానే ఉంటుందిఎక్స్‌పైరీ డేట్ ఇంకో నీటి వనరు దొరికేంత వరకు. ప్రకృతిలో: డ్యామ్‌లలో, చెరువుల్లో నిల్వ ఉండే నీరు తదుపరి వర్షాకాలం వచ్చే వరకు, కొన్నిసార్లు కరవు కాలంలో 2-3 ఏళ్ల వరకు కూడా వాడుకలోనే ఉంటుంది. ఎక్స్‌పైరీ డేట్ కొన్ని సంవత్సరాలు. బోరు బావుల్లో: మనం భూమి లోపల 50 నుండి 500 అడుగుల లోతు నుండి తోడే నీరు వందల, వేల సంవత్సరాల నాటిది కావచ్చు. అయినా సరే, అదే నీటిని మనం అత్యంత సురక్షితమైనదిగా, ఆరోగ్యకరమైనదిగా భావిస్తాం. ఎక్స్‌పైరీ డేట్ వందల, వేల సంవత్సరాలు.. బహుశా ఎప్పటికీ అవ్వదుఆలోచించాల్సిన విషయం: నిజానికి నీటికి ఎటువంటి ఎక్స్‌పైరీ డేట్ ఉండదు. దాని కాలపరిమితిని నిర్ణయించేది కేవలం మన ఆలోచన, అది మనకు దొరికే లభ్యత, మరియు దాని పరిశుభ్రత మాత్రమే. నీరు సులభంగా దొరికినప్పుడు దాన్ని 'పాసిపోయింది' అంటాం అదే కరవు వచ్చినప్పుడు ఆ నీరే అమృతంతో సమానమైపోతుంది. అందుకే, నీటిని ఎంతో బాధ్యతగా, పొదుపుగా వాడుకుందాం. లేకపోతే, ప్రకృతిలో నీరు అయిపోవడానికి ముందే, మన అజాగ్రత్త మనల్ని దాహంతో అలమటించేలా చేస్తుంది. మన భవిష్యత్తును కాపాడుకోవడానికి ఒక పిలుపు అన్నారు.

# వినాయక చవితి పేరుతో ప్రజా మైదానంలో ఎగ్జిబిషన్ దందా ఆపాలి

**- కామరాజ్ హరీష్ - ఎగ్జిబిషన్‌కు ఇచ్చిన అనుమతిని తక్షణమే రద్దు చేయాలి:**

**- కామరాజ్ హరీష్**

విజయవాడ వినాయక చవితి వేడుకలకు తాము వ్యతిరేకం కాదని,అయితే వేడుకల పేరుతో విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని సితార సెంటర్ లేబర్ కాలనీ గ్రౌండ్‌ను ప్రైవేటు ఎగ్జిబిషన్‌కు వినియోగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కామరాజ్ హరీష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, పిల్లలు, యువతకు ఉపయోగపడాల్సిన మైదానాన్ని దీర్ఘకాలం ప్రైవేటు కార్యక్రమాలకు కేటాయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇదే అంశంపై గతంలో ఖఉఖీలో ఫిర్యాదు చేయగా, ఎగ్జిబిషన్‌కు అనుమతి లేదని అధికారులు సమాధానం ఇచ్చారని, ఇప్పుడు అదే ప్రాంగణంలో ఎగ్జిబిషన్‌కు 11 రోజుల అనుమతి ఇచ్చినట్లు చెబుతుండటంపై ఎస్టేట్ అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌన్సిల్ తీర్మానాలు, ప్రజా ప్రయోజనాలు పక్కన పెట్టి ఎగ్జిబిషన్‌కు అనుమతులు ఎలా ఇచ్చారో అధికారులు వెల్లడించాలని అన్నారు. రోజుకు రూ.19,000 చొప్పున కార్పొరేషన్‌కు చెల్లిస్తున్నారని చెబుతున్న నేపథ్యంలో, స్టాల్స్ నుంచి ఎంత వసూలు చేస్తున్నారు, ఎన్ని స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు, నిర్వాహకులు ఎంత మొత్తాన్ని వసూలు చేస్తున్నారు, కార్పొరేషన్‌కు ఎంత చెల్లిస్తున్నారు అనే పూర్తి వివరాలను బహిరంగపరచాలని కోరారు. పోలీస్, అగ్నిమాపక, ఆర్ అ బి, ప్రజారోగ్య, టౌన్ ప్లానింగ్ తదితర శాఖల అవసరమైన అనుమతులు, భద్రతా ధ్రువపత్రాలు పూర్తిగా పరిశీలించకుండా ఎగ్జిబిషన్‌కు అనుమతి ఇచ్చి ఉంటే అది ప్రజల భద్రతతో చెలగాటమేనని హెచ్చరించారు. ప్రజా మైదానం ప్రైవేటు వ్యాపారాల కోసం కాదు.. ప్రజల కోసం ఉండాలని కామరాజ్ హరీష్ కుమార్ స్పష్టం చేశారు. గతంలో ఇదే గ్రౌండ్‌లో అగ్ని ప్రమాదం జరిగిన నేపథ్యంలో భద్రతా ప్రమాణాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉండగా, ఎగ్జిబిషన్ నిర్వహణకు అనుమతి ఇవ్వడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కార్పొరేషన్ ఆదాయం పేరుతో ప్రజలకు ఉపయోగపడే మైదానాలను ప్రైవేటు కార్యక్రమాలకు అప్పగించే విధానాన్ని వెంటనే నిలిపివేయాలని, లేబర్ కాలనీ గ్రౌండ్‌లో ఎగ్జిబిషన్‌కు ఇచ్చిన అనుమతిని తక్షణమే రద్దు చేసి, మైదానాన్ని ప్రజలకు తిరిగి అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే ప్రజా ప్రయోజనాల కోసం యువతతో కలిసి ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమం చేపడతామని, అవసరమైతే న్యాయపరమైన మార్గాలను ఆశ్రయిస్తామని ఆయన హెచ్చరించారు.

# రాయచోటిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం.!



**రాయచోటి** అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తామని రాయచోటి నియోజకవర్గం టిడిపి నాయకులు మండిపల్లె లక్ష్మీ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాయచోటి పట్టణంలోని పలు ప్రాంతాలలో లక్ష్మీ ప్రసాద్ రెడ్డి ఇతర అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పర్యటించారు. ప్రజల నుండి అనేక సమస్యలను అడిగి తెలుసుకున్నారు . ఈ సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో చర్చించారు. మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి సహకారంతో రాయచోటి రూపురేఖలే మారుస్తామని స్పష్టం చేశారు. రాయచోటి టౌన్‌లోని కె.రామాపురం ప్రాంతంలో తెలుగుదేశం పార్టీ నాయకులు డా. మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాల్లో నెలకొన్న రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం, డ్రైనేజీ తదితర సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు వివరించిన సమస్యలను సావధానంగా విన్న డా. మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తామని, రాయచోటి అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. పేద, మధ్యతరగతి ప్రజల కోసం ?5కే భోజనం అందించే అన్న క్యాంటీన్‌లో మంత్రి మేనల్లుడు, టీడీపీ యువ నాయకులు మౌర్య రెడ్డి× ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలపై భారం పడకుండా ?5 ఖర్చును కూడా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి భరిస్తూ ఉచితంగా భోజనం అందిస్తున్న అన్న క్యాంటీన్‌లో ఆహారం నాణ్యత, రుచి, పరిశుభ్రత, ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. భోజనం చేస్తున్న పేద ప్రజలతో స్వయంగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు నాణ్యమైన భోజనం అందేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుందని మౌర్య రెడ్డి తెలిపారు. కలకడ మండలం దేవళంపేటకు చెందిన ఎద్దుల వీరప్ప స్వర్గస్తులైన విషయం తెలుసుకున్న డాక్టర్ మండిపల్లె లక్ష్మీ ప్రసాద్ రెడ్డి భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వీరప్ప కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఇటీవల బలరాం కుమార్తె వివాహం జరిగింది. ఆ సమయంలో అందుబాటులో లేకపోవడంతో వివాహ వేడుకకు హాజరు కాలేకపోయిన డా. మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి బలరాం ఇంటికి వెళ్లి నూతన వధూవరులను కలిశారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆప్యాయంగా పలకరించి, ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన దంపతులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో కలకాలం ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. రాయచోటి పట్టణంలోని లయ ఫంక్షన్ హాల్‌లో మార్కెట్ బాబులు కుమార్తె ఎంగేజ్‌మెంట్ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ మండిపల్లె లక్ష్మీ ప్రసాద్ రెడ్డి గారు, మౌర్యా రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నూతన జంటకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, ఆత్మీయులు పాల్గొన్నారు.

# డి. కొట్టాలలో ఘనంగా ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు



**రుద్రవరం** డి.కొట్టాల గ్రామంలోని శ్రీ రామాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు (ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ) ఆధ్వర్యంలో గత ఐదు రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో ముగిశాయి. ఈ సందర్భంగా ఇస్కాన్ ధర్మ ప్రచారకులు శ్రీశ్రీ నిత్యతృప్తదాస్ స్వామీజీ చేసిన రామాయణ, మహాభారత, భగవద్గీత ప్రవచనాలు, స్థానిక మండలి భజనలు భక్తులను ఎంతగానో అలరించగా, అర్చకులు సత్యనారాయణశర్మ నేతృత్వంలో భక్తులు గోవును సర్వాంగ సుందరంగా అలంకరించి సామూహిక కుంకుమార్చనలు, గోపూజను ఘనంగా నిర్వహించారు. సమాజంలో భక్తిచింతన పెరిగినప్పుడే అందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లుతారని తితిదే హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ ముగింపు వేడుకల్లో పెద్దపల్లి బ్రహ్మానందరెడ్డి, నరసింహారెడ్డి, చిన్న సుబ్బారెడ్డి, రామకృష్ణారెడ్డి, వెంకటరామిరెడ్డి, రాముడు, కృష్ణ, నాగరాజు, మల్లికార్జున్, దస్తగిరిరెడ్డి తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ నగేష్



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )మెదక్ జిల్లాలో నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంపియన్ డే కార్యక్రమంలో భాగంగా మెదక్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) నేడు కుల్చారం మండలంలోని పోతంశెట్టిపల్లి గ్రామం, పాపన్నపేట మండలంలోని లక్ష్మీనగర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అందిస్తున్న సేవలు, ఓటర్ల జాబితా పరిశీలన, ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహణ తీరును అదనపు కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చిన ఓటర్ల నుంచి స్వీకరిస్తున్న అభ్యంతరాలు, దరఖాస్తులు తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.అదేవిధంగా ఆయా గ్రామాల్లో మ్యాపింగ్ కాని కేసులు (చీశీ మీుజూజూఱఅస్త్ర ఝుంవం) ఉన్నాయా అనే అంశాన్ని పరిశీలించి, సంబంధిత రికార్డులను అధికారులు, సిబ్బందితో కలిసి ధృవీకరించారు. ఓటర్ల జాబితా ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు.ప్రత్యేక ఓటరు కంపియన్ డే సందర్భంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు అవసరమైన సమాచారం, సహాయాన్ని అందిస్తూ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాపన్నపేట తాసిల్దార్ సతీష్ జిపిఓ రవి సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డిపేట ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక





ఎల్లారెడ్డిపేట(ప్రశ్న న్యూస్) ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల స్థాయిలో జర్నలిస్టుల ఐక్యత, వృత్తిపరమైన అభివృద్ధి, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, ప్రజలకు--ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేయడం వంటి లక్ష్యాలతో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులుగా బండారి బాల్ రెడ్డి, కాసు శ్రీనివాసరాజు, అధ్యక్షుడిగా బుగ్గ కృష్ణమూర్తి శర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కులేరి కిషోర్ కుమార్, దుర్గం విజయ్ బాబు, పెంటం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఒగ్గు బాలరాజు యాదవ్ ఎన్నికయ్యారు.
కార్యదర్శులుగా కులేరి దీప్తి కుమార్, ఒగ్గు మహేష్ చంద్ర,కోశాధికారిగా శ్రీ రామోజీ శేఖర్ బాధ్యతలు స్వీకరించనున్నారు.సలహాదారులుగా చిట్కూరి తిరుపతి, శ్రీ రామోజీ ప్రవీణ్, సురేష్ యాదవ్, కార్యవర్గ సభ్యులుగా సురేష్, చేపూరి నాగరాజు, చింతకింది శ్రీనివాస్ ఎన్నికయ్యారు. అలాగే సంయుక్త కార్యదర్శులుగా హిమకొండ పద్మా రెడ్డి, ముద్రకోలా కృష్ణ, బెస్త నరేష్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేస్తామని, పాత్రికేయుల హక్కులు, సంక్షేమం కోసం ముందుండి పనిచేస్తామని తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని గ్రామీణ ప్రాంతాల ప్రజా సమస్యలను సమర్థవంతంగా వెలుగులోకి తీసుకువచ్చి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, సామాజిక అంశాలను వాస్తవాలను ఆధారంగా చేసుకుని ప్రజలకు చేరవేయడమే తమ ప్రధాన లక్ష్యమని తెలియజేశారు.మండలానికి పూర్తిస్థాయి ప్రెస్ క్లబ్ కార్యవర్గం ఏకగ్రీవంగా ఏర్పడటంతో జర్నలిస్టులు, ప్రజా ప్రతినిధులు, వివిధ వర్గాల నాయకులు నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ సభ్యులను రాచర్ల గొల్లపల్లి సర్పంచ్ కొండ రమేష్ గౌడ్, కాంగ్రెస్ నాయకుడు మర్రి శ్రీనివాస్ రెడ్డి శాలువాలతో సన్మానించారు.

# లోక్ అదాలత్‌లో సంచలన ఫలితం..
# 2,020 కేసులకు పరిష్కారం

**రాజీతోనే వివాదాలకు ముగింపు..**

**సమయం, ఖర్చు ఆదా : జడ్జి స్వాతి గౌడ్**




గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు ఇరుపక్షాలకు న్యాయం జరుగుతుందని మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మూల స్వాతి గౌడ్ అన్నారు.గజ్వేల్ కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్ కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి మన్వీర్ తో కలిసి ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా అన్ని రకాల కేసులు కలిపి 2,020 కేసులకు పరిష్కారం లభించినట్లు తెలిపారు.రాజీ ద్వారా వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవడం వల్ల సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొంటాయని న్యాయమూర్తులు పేర్కొన్నారు. కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోవడం కంటే పరస్పర అంగీకారంతో వివాదాలను పరిష్కరించుకోవడం ఉత్తమమని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏపీపీ మాధవీలత, గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ. కిరణ్ సాగర్ రావు, ఉపాధ్యక్షుడు నరేష్ చారి, తొగుట సీఐ లతీఫ్ పాల్గొన్నారు.అలాగే జగదేవ్‌పూర్, గజ్వేల్, దౌల్తాబాద్, రాయపోల్, గౌరారం, ములుగు, బేగంపేట్ పోలీస్‌స్టేషన్ల ఎస్ఐలు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

# 18 మంది చిన్నారులకు గుండెకు పునర్జన్మ

**- లండన్ వైద్యుడు రమణారావు దన్నపునేని సేవలకు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ప్రశంసలు**

**- నిమ్స్‌లో ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు.. చిన్నారుల కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటుకు సీఎం సానుకూలత**

జగిత్యాల (ప్రశ్న న్యూస్) గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న నిరుపేద చిన్నారులకు ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు నిర్వహిస్తూ వారి కుటుంబాల్లో వెలుగులు నింపుతున్న జగిత్యాల జిల్లాకు చెందిన ప్రముఖ వైద్యుడు రమణారావు దన్నపునేని సేవలను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అభినందించారు. లండన్‌లో వైద్య వృత్తిని కొనసాగిస్తున్న రమణారావు దన్నపునేని తన వైద్య బృందంతో కలిసి హైదరాబాద్‌లోని నిమ్స్‌లో తాజాగా 18 మంది చిన్నారులకు గుండె శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించారు.గత ఏడు సంవత్సరాలుగా 'లిటిల్ హార్ట్ ఫౌండేషన్' ద్వారా గుండె వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులకు రమణారావు అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. లండన్ నుంచి వైద్య నిపుణులు, నర్సింగ్ సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాన్ని హైదరాబాద్‌కు తీసుకువచ్చి నిరుపేద చిన్నారులకు వైద్య సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు.తాజా వైద్య శిబిరంలో సుమారు 200 మంది చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించగా, వారిలో గుండె శస్త్రచికిత్స అవసరమైన 18 మందిని గుర్తించి ఆపరేషన్లు నిర్వహించినట్లు తెలిపారు. వీరిలో జగిత్యాల నియోజకవర్గానికి చెందిన ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నారని ఎమ్మెల్యే వెల్లడించారు.

### రూ.15--20 లక్షల ఖర్చు.. నిరుపేదలకు ఉచిత వైద్యం

ప్రైవేట్ ఆస్పత్రుల్లో చిన్నారులకు గుండె శస్త్రచికిత్స చేయించాలంటే సుమారు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఖర్చవుతుందని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తెలిపారు. ఇంతటి భారీ వ్యయాన్ని భరించలేని నిరుపేద కుటుంబాలకు ఉచితంగా అత్యాధునిక వైద్యం అందించడం గొప్ప సేవ అని కొనియాడారు.డబ్బు లేక వైద్యం అందక చిన్నారుల ప్రాణాలు ప్రమాదంలో పడకుండా, వారికి మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో రమణారావు దన్నపునేని చేస్తున్న సేవలు ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు.

### నిమ్స్‌లో ప్రత్యేక విభాగం ఏర్పాటుకు సీఎం సానుకూలత

చిన్నారుల గుండె వ్యాధులకు మరింత విస్తృతంగా వైద్య సేవలు అందించేందుకు నిమ్స్‌లో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాల్సిన అవసరంపై చర్చించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.చిన్నారుల గుండె శస్త్రచికిత్సలకు సంబంధించి అవసరమైన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ప్రభుత్వ సలహాదారు, మాజీ ఆరోగ్యశాఖ మంత్రి సుదర్శన్ రెడ్డికి సూచించినట్లు ఎమ్మెల్యే వివరించారు. నిమ్స్‌తో పాటు టిమ్స్‌లో కూడా చిన్నారుల గుండె వైద్యానికి ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించినట్లు తెలిపారు.

### వైద్య బృందంతో కీలక సమావేశం



శనివారం నిమ్స్ చీఫ్ కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ అమరేశ్వరరావు, వైద్యుడు రమణారావు దన్నపునేని, ముఖ్యమంత్రి సలహాదారు సుదర్శన్ రెడ్డితో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సుమారు గంటన్నర పాటు సమావేశమయ్యారు. చిన్నారుల గుండె వైద్యం, ఉచిత శస్త్రచికిత్సలు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఈ సందర్భంగా చర్చించారు.తాజాగా శస్త్రచికిత్సలు చేయించుకున్న 18 మంది చిన్నారుల్లో జగిత్యాల నియోజకవర్గానికి చెందిన ఇద్దరు దళిత చిన్నారులు కూడా ఉన్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వారికి అవసరమైన ఆర్థిక సహాయం అందించినట్లు పేర్కొన్నారు. రమణారావు దన్నపునేని తన సొంత ఖర్చులతో లండన్, అమెరికా తదితర దేశాల నుంచి వైద్య నిపుణుల బృందాలను హైదరాబాద్‌కు తీసుకువచ్చి నిరుపేద చిన్నారులకు గుండె శస్త్రచికిత్సలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు.నిరుపేద చిన్నారులకు అత్యాధునిక గుండె వైద్యం అందించేందుకు సహకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, నిమ్స్ వైద్య బృందం, డాక్టర్ రమణారావు దన్నపునేని, ఆయన వైద్య బృందానికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## అర్హత లేకుండా వైద్యం చేస్తున్న
# ఆర్ఎంపీపై కేసు



**ఎల్లారెడ్డిపేట(ప్రశ్న న్యూస్)** గొల్లపల్లి గ్రామానికి చెందిన ఆర్ఎంపీ శ్రీనివాస్ గౌడ్‌పై ఎల్లారెడ్డిపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఎలాంటి వైద్య అర్హతలు, ధ్రువపత్రాలు లేకుండానే మందులు, ఇంజెక్షన్లు, రక్త పరీక్షలు నిర్వహిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారంటూ గొల్లపల్లి గ్రామానికి చెందిన చాతని రామ్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై ఎన్. రమేష్ తెలిపారు. ఫిర్యాదు ప్రకారం గత నెలలో గొల్లపల్లి గ్రామానికి చెందిన మల్లేష్(ఇంటి పేరు) అరుణ (35)కు ఛాతిలో నొప్పి రావడంతో ఆర్ఎంపీ శ్రీనివాస్ గౌడ్ వద్దకు వెళ్లినట్లు తెలిపారు. ఆమెకు మందులు, ఇంజెక్షన్లు ఇచ్చినప్పటికీ నొప్పి తగ్గకపోవడంతో సిరిసిల్లలోని ఆసుపత్రికి, అనంతరం కరీంనగర్‌లోని మురుగన్ ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందినట్లు ఫిర్యాదులో తెలిపారు. అర్హత లేకుండా వైద్యం చేస్తూ, తనకు కమిషన్ ఇచ్చే ఆసుపత్రులకు రోగులను తీసుకెళ్లడం ద్వారా ప్రజలను మోసం చేస్తున్నారని ఫిర్యాదుదారు ఆరోపించారు. తన కుమార్తె ఆరోగ్య పరిస్థితిపై సరైన సమాచారం ఇవ్వకుండా చికిత్స అందించడం వల్లే ఆమె మృతికి ఆర్ఎంపీ శ్రీనివాస్ కారణమయ్యారని ఆరోపిస్తూ చాతని రామ్‌రెడ్డి పోలీసులకు దరఖాస్తు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

### అర్హత లేని వ్యక్తుల వద్ద వైద్యం చేయించుకోవద్దు.

వైద్య అర్హతలు, ధ్రువపత్రాలు లేని వ్యక్తుల వద్ద వైద్యం చేయించుకోవద్దని ఎస్సై ఎన్. రమేష్ ప్రజలకు తెలియజేశారు. అర్హత లేని వ్యక్తుల వద్ద మందులు, ఇంజెక్షన్లు, రక్త పరీక్షలు చేయించుకోవడం వల్ల ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందన్నారు.అనుమానాస్పదంగా వైద్యం చేస్తున్న వ్యక్తుల వివరాలను సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు లేదా పోలీసులకు తెలియజేయాలని కోరారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని అన్నారు. ప్రజల ఆరోగ్య భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, అర్హత కలిగిన వైద్యులను మాత్రమే సంప్రదించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎస్సై రమేష్ తెలిపారు.

# అంగట్లో ఐఫోన్ మాయం

**- రద్దీ ప్రాంతాలే దొంగల టార్గెట్**



**ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్)** రాచర్ల గొల్లపల్లి గ్రామంలో నిర్వహించిన వార సంతలో ఐఫోన్ మాయమైన ఘటన కలకలం రేపింది. సంతకు వచ్చిన ఓ వ్యక్తి రద్దీగా ఉన్న ప్రాంతంలో తన మొబైల్ ఫోన్‌ను కోల్పోయినట్లు తెలిపారు.వార సంతలు, మార్కెట్లు, జాతరలు, బస్టాండ్లు వంటి రద్దీ ప్రాంతాలను దొంగలు లక్ష్యంగా చేసుకుంటున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జనసందోహాన్ని అదునుగా చేసుకుని మొబైల్ ఫోన్లు, పర్సులు, నగదు తదితర వస్తువులను అపహరిస్తున్న ఘటనలు అప్పుడప్పుడు వెలుగులోకి వస్తున్నాయి.ఈ నేపథ్యంలో సంతలు, మార్కెట్లకు వచ్చే ప్రజలు తమ విలువైన వస్తువులు, మొబైల్ ఫోన్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు. రద్దీ ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరుతున్నారు.రద్దీ ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండటం ద్వారా దొంగతనాలను నివారించవచ్చని పలువురు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.

# టీచర్ రామచంద్రనాయక్ సస్పెన్షన్

**అనంతపురం** కళ్యాణదుర్గం పట్టణంలో నార్త్ హై స్కూల్ లో పనిచేస్తున్న తెలుగు టీచర్ రామచంద్రనాయక్ ను సస్పెన్షన్ చేస్తూ శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి డా.ఎన్. అయూబ్ హుస్సేన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన పై లైంగిక ఆరోపణలు రావడంతో స్థానిక పోలీస్ స్టేషన్లో ఫోక్సో కేసు నమోదయింది. దీనిపై స్థానిక ఎంఈఓ-1 విజయ కుమారి విచారణ చేసి నివేదిక అందజేయడంతో ఆ నివేదిక ఆధారంగా సస్పెన్షన్ చేసినట్లు తెలిపారు.

## హరీష్ రావు ఆరోపణలపై
# స్పష్టత ఇచ్చిన ఆర్టీసీ యాజమాన్యం..

పండుగ సమయాల్లో నడిపే ప్రత్యేక బస్సుల టికెట్ ధరలను సాధారణ చార్జీల కంటే గరిష్టంగా 1.5 రెట్లు (యాభై శాతం అదనంగా) పెంచుకునే వెసులుబాటు కల్పించినది 2003 నాటి ఊా ఓబ. ఔనీ. 16 (జీవో నంబర్ 16). తెలంగాణ (ుఊాఖీఅ) మరియు ఆంధ్రప్రదేశ్ (ంఖాఖీఅ) ఆర్టీసీ యాజమాన్యాలు పండుగల సమయంలో అదనపు రద్దీని తట్టుకోవడానికి నడిపే ప్రత్యేక సర్వీసులకు ఈ జీవో ఆధారంగానే చార్జీలను సవరిస్తుంటాయి. ఈ జీవోకు సంబంధించిన ముఖ్య వివరాలు :జీవో నంబర్: ఊా ఓబ. ఔనీ. 16, రవాణా శాఖ (రోడ్లు ు భవనాలు).జారీ చేసిన సంవత్సరం: 2003. నిబంధన: పండుగ రద్దీ కోసం నడిపే 'ప్రత్యేక బస్సులు' (రాజూవఇతిజీశ్రీ ఃబీబవబ) ఒకవైపు ప్రయాణికులతో వెళ్లినప్పటికీ, తిరుగు ప్రయాణంలో (ఖీవబిబీతిని ఏనీబీతినివవం) ఖాళీగా రావాల్సి వస్తుంది. ఆ సమయంలో అయ్యే కనీస డీజిల్ మరియు నిర్వహణ ఖర్చులను భర్తీ చేసుకోవడానికి సాధారణ ధర కంటే గరిష్టంగా 50% వరకు అదనపు చార్జీలు వసూలు చేసుకోవడానికి ఈ ఉత్తర్వు ద్వారా ప్రభుత్వాలు అనుమతి ఇచ్చాయి.

## 'ఓపెన్ డ్రింకింగ్' (బహిరంగ ప్రదేశాల్లో
# మద్యం సేవించడం)పై ప్రత్యేక తనిఖీలు

**గుంటూరు** నిన్న రాత్రి 6 గంటల నుండీ 10 గంటల వరకు గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఐపీస్ గారి ఉత్తర్వుల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో దాడులు నిర్వహించి 37ఎఫ్ ఐ ఆర్, కేసు లు , 40 పెట్టి కేసులు,10 మంది పై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, నమోదు చేసినారు.గుంటూరు జిల్లా ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ మరియు బహిరంగ ప్రదేశాల్లో మందుబాబుల వేధింపుల నుంచి మహిళలు, సాధారణ పౌరులకు రక్షణ కల్పించడమే ధ్యేయంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో 'ఓపెన్ డ్రింకింగ్' పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం జరిగింది.జిల్లా పోలీసు యంత్రాంగం చేపట్టిన ఈ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ముఖ్యమైన కూడళ్లు, వైన్ షాపుల సమీప ప్రాంగణాలు, ఖాళీ స్థలాలు, పార్కులు, బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు మరియు నిర్మానుష్య రహదారులలో తనిఖీలు చేపట్టారు.ముఖ్య విశేషాలు ు చర్యలు: కేసుల నమోదు: జిల్లా వ్యాప్తంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ, ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న పలువురిని అదుపులోకి తీసుకుని, సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయడం జరిగింది. కౌన్సెలింగ్: బహిరంగంగా మద్యం సేవించడం నేరమని, దీనివల్ల సమాజంలో శాంతిభద్రతలకు భంగం వాటిల్లుతుందని అదుపులోకి తీసుకున్న వ్యక్తులకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు.

# కొండపల్లి అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత

**- మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు**

**కొండపల్లి,** కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఈలప్రోలు లేఅవుట్, ఇబ్రహీంపట్నం గాజులపేట లేఅవుట్‌లలో అంతర్గత రహదారుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాదు గారు తెలిపారు.కొత్తగా ఏర్పడిన కాలనీల్లో తాగునీటి కొళాయిల ప్రారంభ కార్యక్రమానికి వచ్చిన సమయంలో స్థానికులు అంతర్గత రహదారుల సమస్యను ఎమ్మెల్యే కృష్ణప్రసాదు గారి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయా సమస్యల పరిష్కారానికి రూ.80 లక్షలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు డీఎంఎఫ్ నిధుల కింద ఒక్కో చోట రూ.40 లక్షలు మంజూరు చేసి ఈలప్రోలు లేఅవుట్, కొండపల్లి లేఅవుట్, గాజులపేట లేఅవుట్‌లలో ప్రధాన రహదారుల నిర్మాణానికి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు.మరో రూ.20 నుంచి రూ.50 లక్షలు అందుబాటులోకి వస్తే ప్రధాన రహదారులన్నీ పూర్తయ్యే అవకాశం ఉందని కాలనీ వాసులు కోరినట్లు తెలిపారు. ఈ విషయాన్ని కలెక్టర్ గారి దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా అదనపు నిధులు మంజూరు చేయించేందుకు ప్రయత్నిస్తానని ఎమ్మెల్యే కృష్ణప్రసాదు గారు హామీ ఇచ్చారు.ప్రధాన రహదారులన్నింటినీ అభివృద్ధి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేస్తామని చెప్పారు. అలాగే కొండపల్లి మున్సిపాలిటీకి రూ.96 కోట్ల నిధులు కేటాయించిన నేపథ్యంలో ఆ నిధులు త్వరలో అందుబాటులోకి వస్తాయని ఆశిస్తున్నానన్నారు.రూ.96 కోట్ల నిధులు అందితే ఈ రెండు ప్రధాన లేఅవుట్‌లలోని అంతర్గత రహదారులను కూడా సీసీ రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కొండపల్లి మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం, కూటమి పార్టీల నాయకులు సమన్వయంతో ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాదు గారు పేర్కొన్నారు.

# అన్న ప్రసాద వితరణ దాతలు

**శ్రీశైలం** అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటైన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వాముల వారి శ్రీ శైల దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం కొరకు శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వాముల వారి శ్రీశైల దేవస్థానం వారు నిర్వహించిన నిత్య అన్నదాన వితరణ పథకానికి ఏ. వేణుమాధవ్, మహబూబాబాద్, తెలంగాణా వారు అన్నప్రసాదవితరణ పథకానికి రూ.1,00,000/-లు విరాళాన్ని విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని శ్రీశైలం దేవస్థానం పర్యవేక్షకులు కె. శివప్రసాద్ కు అందజేశారు. దర్శనం అనంతరం దాతకు కె శివప్రసాదరావు తగు రశీదు, లడ్డు ప్రసాదాలు అందజేయబడ్డాయి

## శ్రీవారి బ్రహ్మోత్సవాలకు

# సీఎం చంద్రబాబుకు ఆహ్వానం

**- ఆహ్వాన పత్రిక అందజేసిన టీటీడీ ఛైర్మన్, ఈవో**



**తిరుమల(ప్రశ్న న్యూస్)** తిరుమల శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును టీటీడీ ఘనంగా ఆహ్వానించింది. అమరావతిలోని ముఖ్యమంత్రి నివాసంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, పనబాక లక్ష్మీ, జానకిదేవి, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర ముఖ్యమంత్రిని కలిసి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా టీటీడీ వేద పండితులు ముఖ్యమంత్రికి వేదాశీర్వచనం అందించారు. అనంతరం బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ చేపడుతున్న ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు ఆరా తీశారు.

### భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

బ్రహ్మోత్సవాలకు భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో దర్శనం, వసతి, తాగునీరు, అన్నప్రసాదం, లడ్డూ ప్రసాదం, రవాణా, పారిశుధ్యం తదితర సౌకర్యాలపై ముఖ్యమంత్రి టీటీడీ ఛైర్మన్, ఈవోలతో చర్చించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించినట్లు సమాచారం.

### భద్రతకు పటిష్ట చర్యలు

బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, క్యూలైన్ల నిర్వహణ తదితర అంశాలపైనా సమీక్షించారు. ప్రధాన వాహన సేవలు, పట్టువస్త్రాల సమర్పణ, ధ్వజారోహణం, చక్రస్నానం వంటి కార్యక్రమాలు సజావుగా జరిగేలా సమన్వయంతో చర్యలు చేపట్టాలని చర్చించినట్లు టీటీడీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో టీటీడీ వేద పండితులు, అర్చకులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవ ఏర్పాట్లు పకడ్బందీగా

# భక్తుల భద్రత, సౌకర్యాలకు ప్రాధాన్యం

**- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**

అమరావతి(ప్రశ్న న్యూస్) తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. సచివాలయంలో శనివారం రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, హోం మంత్రి వంగలపూడి అనితతో కలిసి బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ నెల 15న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించే కార్యక్రమం, ధ్వజారోహణం, వాహనసేవలు, చక్రస్నానం తదితర ప్రధాన కార్యక్రమాల సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా చర్యలపై చర్చించారు. ముఖ్యమంత్రి కార్యక్రమం, సాధారణ భక్తుల దర్శనాలు సజావుగా జరిగేలా క్యూలైన్లు, ట్రాఫిక్, భద్రతా ఏర్పాట్లను సమన్వయం చేయాలని మంత్రి సూచించారు.

### అన్ని సౌకర్యాలపై దృష్టి

బ్రహ్మోత్సవాలకు భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున దర్శనం, క్యూలైన్లు, తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్యం, వైద్యం, అత్యవసర సేవలు, వసతి, రవాణా, లగేజీ నిర్వహణపై ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని ఆదేశించారు. రద్దీని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చోట అదనపు సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. అన్నప్రసాదం, లడ్డూ ప్రసాదం, వసతి తదితర సౌకర్యాల్లో కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, ప్రసాదాల లభ్యతను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

### వదంతులపై అప్రమత్తంగా ఉండాలి



బ్రహ్మోత్సవాల సందర్భంగా సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారం, వదంతులు వ్యాప్తి చెందకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. అధికారిక సమాచారాన్ని ఎప్పటికప్పుడు భక్తులకు అందుబాటులో ఉంచాలని, తప్పుడు ప్రచారాన్ని గుర్తించి వెంటనే ఖండించాలని తెలిపారు. సమీక్షలో టీటీడీ ఈవో, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి, తిరుపతి జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితర ఉన్నతాధికారులు పాల్గొని ఏర్పాట్ల వివరాలను మంత్రులకు వివరించారు.

## వినాయక చవితి వేడుకల్లో

# నిబంధనలు పాటించాలి

**- మట్టి విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి**

**- ఎస్పీ సుబ్బరాయుడు, కమిషనర్ జయకృష్ణ**



తిరుపతి(ప్రశ్న న్యూస్) వినాయక చవితి వేడుకలను నిబంధనలు పాటిస్తూ భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. జయకృష్ణ సూచించారు. నిమజ్జనం సందర్భంగా విగ్రహాల ఊరేగింపునకు సంబంధించిన రూట్‌మ్యాప్‌ను శనివారం కచ్చపి ఆడిటోరియంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండపాల నిర్వాహకులతో నిబంధనలు ఉల్లంఘించకుండా వేడుకలు నిర్వహిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. నగరవాసులు మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని అధికారులు కోరారు. మండపాల నిర్వాహకులు పరస్పరం సమన్వయంతో వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు. నిమజ్జనం కోసం రూపొందించిన రూట్‌మ్యాప్ ప్రకారం విగ్రహాలను వినాయకసాగర్‌కు తీసుకురావాలని తెలిపారు. మండపాల నిర్వాహకులు నిమజ్జనం తేదీని ముందుగానే తెలియజేసి, నిర్ణయించిన రోజునే నిమజ్జనానికి రావాలని సూచించారు. నిమజ్జనం సందర్భంగా మద్యం సేవించడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. నిమజ్జనం మూడో, ఏడో రోజు వినాయకసాగర్, ఆయా మార్గాల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వేడుకలు విజయవంతంగా జరిగేందుకు ప్రజలు, మండపాల నిర్వాహకులు పోలీసు, నగరపాలక సంస్థ అధికారులకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ రవి మనోహర్ ఆచారి, డీఎస్పీలు భక్తవత్సలం, కొండయ్య, నిమజ్జన కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, సభ్యులు ఆర్సీ మునికృష్ణ, గుండాల గోపి, నవీన్‌కుమార్‌రెడ్డి, వరప్రసాద్, విద్యుత్ ఎస్ఈ చంద్రశేఖర్, మండపాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ కార్యకర్త కుటుంబానికి

# రూ.5 లక్షల బీమా చెక్కు



కురిచేడు(ప్రశ్న న్యూస్) ప్రమాదవశాత్తు మృతి చెందిన టీడీపీ కార్యకర్త కుటుంబానికి పార్టీ ప్రమాద బీమా కింద రూ.5 లక్షల ఆర్థిక సాయం అందింది. కురిచేడు మండలం ఆవులమంద పంచాయతీ పరిధిలోని ప్రతిజ్ఞపురి కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త చదమల అంజమ్మ ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందారు. ఆమె గతంలో టీడీపీ సభ్యత్వం తీసుకున్న నేపథ్యంలో బీమా పరిహారం మంజూరైంది. శనివారం దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అంజమ్మ కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం పొందిన కార్యకర్తలకు ప్రమాద సమయంలో ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రమాద బీమా సదుపాయం అమలు చేస్తున్నట్లు తెలిపారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు కాట్రాజు నాగరాజు, కురిచేడు మండల టీడీపీ అధ్యక్షుడు పిడతల నెమిలయ్యతో పాటు ఆవులమంద గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు, మండల నాయకులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాల నిర్వహణపై సమన్వయ సమావేశం

**- మండపాల భద్రత, నిమజ్జన ఊరేగింపుపై పోలీసుల సూచనలు**



నాచారం(ప్రశ్న న్యూస్) గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు నాచారం సీకే గార్డెన్స్‌లో గణేష్ ఉత్సవ నిర్వహణ సమన్వయ సమావేశం నిర్వహించారు. కన్వీనర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి పోలీసు అధికారులు, ఉత్సవ నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి సీఐ ధనుంజయ, డీఐ మాన్సింగ్, ఎస్ఐ మైబెల్లి, ఎస్ఐ ప్రభాకర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ ధనుంజయ మాట్లాడుతూ గణేష్ మండపాల ఏర్పాటు, నిర్వహణలో నిర్వాహకులు తప్పనిసరిగా భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. మండపాల వద్ద విద్యుత్ భద్రత, అగ్ని ప్రమాదాల నివారణ, జనసందోహం నియంత్రణ తదితర అంశాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అదేవిధంగా గణేష్ నిమజ్జన ఊరేగింపు సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికతో కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. ఊరేగింపు మార్గంలో భద్రతా ఏర్పాట్లు, వాహనాల రాకపోకల నియంత్రణ, భక్తుల భద్రతకు అవసరమైన చర్యలపై అధికారులు వివరించారు. గణేష్ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో పాటు శాంతియుతంగా, క్రమశిక్షణతో నిర్వహించేందుకు పోలీసు శాఖకు నిర్వాహకులు సహకరించాలని అధికారులు కోరారు. ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో ముందుకు సాగాలని సమావేశంలో నిర్ణయించారు.

# 40 ఏళ్ల నిరీక్షణకు తెర..

## గుండ్లకమ్మపై వంతెన ప్రారంభం



త్రిపురాంతకం(ప్రశ్న న్యూస్) గుండ్లకమ్మ వాగుపై వంతెన కోసం నాలుగు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ప్రజల నిరీక్షణకు తెరపడింది. త్రిపురాంతకం మండలం మిరియంపల్లి నుంచి ఆవులమంద--చందవరం రహదారి వరకు రూ.2.70 కోట్లతో నిర్మించిన గుండ్లకమ్మ వాగు వంతెన, బీటీ రోడ్డును గురువారం ప్రారంభించారు. వంతెన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డితో కలిసి దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, యర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు పాల్గొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. వంతెన నిర్మాణంతో మిరియంపల్లి, ఆవులమంద, చందవరం తదితర ప్రాంతాల ప్రజలకు రాకపోకలు సులభతరం కానున్నాయి. వర్షాకాలంలో గుండ్లకమ్మ వాగు ఉధృతంగా ప్రవహించిన సమయంలో రాకపోకలకు ఎదురవుతున్న ఇబ్బందులు తగ్గనున్నాయి. వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, విద్యార్థులు, ఉద్యోగులు, గ్రామీణ ప్రజల ప్రయాణాలకు ఈ వంతెన ఉపయోగపడనుంది. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న వంతెన నిర్మాణం పూర్తికావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## 13 ఏళ్ల ఎడబాటుకు తెర..

# లోక్ అదాలత్‌తో దంపతుల రాజీ

**- కుటుంబ వివాదానికి సామరస్యపూర్వక పరిష్కారం..**

**- ఆనందం వ్యక్తం చేసిన ఇరువర్గాల కుటుంబ సభ్యులు**



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** పదమూడేళ్లుగా వేర్వేరుగా జీవిస్తున్న భార్యాభర్తలు లోక్ అదాలత్ చొరవతో రాజీకి వచ్చి తమ కుటుంబ వివాదాన్ని పరిష్కరించుకున్నారు. దీంతో ఇన్నాళ్లుగా కొనసాగుతున్న కేసుకు ముగింపు పలికినట్లయింది. సిద్దిపేట జిల్లా అహ్మదీపూర్ గ్రామానికి చెందిన అండె లక్ష్మికి తొగుట మండలం లింగంపేట గ్రామానికి చెందిన ఈదయ్య కుమారుడు అండె ఆంజనేయులుతో వివాహం జరిగింది. వివాహ సమయంలో లక్ష్మి తల్లిదండ్రులు రూ.30 వేల నగదు, రెండు తులాల బంగారు ఆభరణాలు, 40 తులాల వెండి ఆభరణాలతో పాటు గృహోపకరణాలను కట్నంగా అందజేశారు. వివాహం అనంతరం కొంతకాలం దంపతుల సంసారం సజావుగానే సాగింది. వారికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. అనంతరం అదనపు కట్నం తీసుకురావాలని భర్తతో పాటు అత్త లక్ష్మి, మామ ఈదయ్య, బావమరిది యాదయ్య, ఆడపడుచు ఎల్లవ్వ, గుడికరిదుల రామచంద్రం తదితరులు తనను శారీరకంగా, మానసికంగా వేధించారని లక్ష్మి ఆరోపించింది. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేయడంతో గ్రామ పెద్దలు దాచారం పోచయ్య, శనిగరం పెద్ద పోచయ్య, కరింగుల రాజయ్య సమక్షంలో పలుమార్లు పంచాయితీలు నిర్వహించి కుటుంబాన్ని సర్దుబాటు చేసేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో చివరకు తనను ఇంటి నుంచి బయటకు పంపించారని లక్ష్మి పేర్కొంది. దీంతో 2013 మే 14న లక్ష్మి గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అదనపు కట్నం కోసం తనను వేధించిన భర్తతో పాటు, అందుకు ప్రేరేపించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరింది. అప్పటి నుంచి భార్యాభర్తలు వేర్వేరుగా జీవిస్తున్నారు.

### లోక్ అదాలత్ చొరవతో పరిష్కారం

పదమూడేళ్ల అనంతరం ఈ కేసు లోక్ అదాలత్ పరిధిలోకి రావడంతో ఇరువర్గాలతో చర్చలు జరిపి కుటుంబ సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు ప్రయత్నించారు. పెద్దల సమక్షంలో జరిగిన చర్చల అనంతరం భార్యాభర్తలు తమ మధ్య ఉన్న విభేదాలను రాజీ ద్వారా పరిష్కరించుకున్నారు.

దీంతో 13 ఏళ్లుగా కొనసాగిన ఎడబాటుకు తెరపడింది. ఇన్నాళ్లుగా కొనసాగిన కుటుంబ వివాదానికి సామరస్యపూర్వకంగా పరిష్కారం లభించడంతో ఇరువర్గాల కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో గజ్వేల్ న్యాయస్థానానికి చెందిన ప్రథమ శ్రేణి న్యాయాధికారి స్వాతి గౌడ్, ఏపీపీ మాధవీలత, గజ్వేల్ పోలీసు వలయ అధికారి సీఐ రవికుమార్, న్యాయవాది అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ జిల్లాలో కూటమి 100 శాతం లక్ష్యం

**- స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి స్థానంలో గెలుపే ధ్యేయం**



విజయవాడ(ప్రశ్న న్యూస్) రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్టీఆర్ జిల్లాలో కూటమి అభ్యర్థులు పోటీ చేసే ప్రతి స్థానంలో విజయం సాధించేలా సమన్వయంతో పనిచేయాలని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు నిర్ణయించారు. విజయవాడలోని ఎన్టీఆర్ భవన్ (ఎంపీ కార్యాలయం)లో శనివారం కూటమి పార్టీల ముఖ్య నేతల సమావేశం జరిగింది. జిల్లాలో 100 శాతం స్ట్రైక్‌రేట్ సాధించడమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. కూటమి తరఫున ఏ పార్టీ అభ్యర్థి పోటీ చేసినా మిగిలిన రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమష్టిగా సహకరించి గెలుపు కోసం పనిచేయాలని నేతలు సూచించారు. గ్రామస్థాయి నుంచి మండలం, మున్సిపాలిటీ, కార్పొరేషన్ స్థాయి వరకు మూడు పార్టీల మధ్య నిరంతర సమన్వయం ఉండేలా ప్రణాళిక సిద్ధం చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల కల్పన, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా వివరించాలని సమావేశంలో చర్చించారు. ప్రతి గ్రామం, వార్డు, డివిజన్ పరిధిలో ప్రభుత్వ పనితీరును ప్రజలకు తెలియజేసేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. స్థానిక ఎన్నికలకు ముందుగానే క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేయడంతో పాటు బలమైన అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలపై దృష్టి సారించాలని నేతలు నిర్ణయించారు. మూడు పార్టీల స్థానిక నాయకులు, ముఖ్య కార్యకర్తల మధ్య సమన్వయాన్ని మరింత పెంచాలని పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి, జనసేన ఎన్టీఆర్ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయకర్త కందుల దుర్గేష్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), టీడీపీ విజయవాడ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి మక్కెన మల్లికార్జునరావు, జిల్లా పార్టీ అధ్యక్షురాలు గద్దె అనురాధ, జనసేన రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు, ఉమ్మడి కృష్ణా జిల్లా జనసేన ఉపాధ్యక్షుడు బొలియశెట్టి శ్రీకాంత్, సమన్వయ కమిటీ సభ్యురాలు బండి కోమలి, బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయ ఇన్‌చార్జి ఉప్పలపాటి శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

# గొల్లపల్లిలో మహిళా కండక్టర్‌పై దాడి

**- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**



ఎల్లారెడ్డిపేట(ప్రశ్న న్యూస్) గొల్లపల్లి గ్రామంలో మహిళా ఆర్టీసీ కండక్టర్‌పై దాడి ఘటన కలకలం రేపింది. బస్సులో విధులు నిర్వహిస్తున్న మహిళా కండక్టర్‌తో ఓ వ్యక్తి వాగ్వాదానికి దిగిన అనంతరం ఆమెపై దాడికి పాల్పడినట్లు సమాచారం. ఈ ఘటనతో ఆగ్రహించిన ప్రయాణికులు, స్థానికులు గొల్లపల్లి ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగారు. దీంతో కొంతసేపు బస్సు నిలిచిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఘటన సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. మహిళా కండక్టర్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. దాడికి గల కారణాలు, ఘటనకు సంబంధించిన ఇతర వివరాలపై విచారణ కొనసాగుతోంది. మహిళా ఉద్యోగిపై దాడి చేయడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# తాళి మహిళలే ఎందుకు వేసుకోవాలి

## నమిత సంచలన వ్యాఖ్యలు, సోషల్ మీడియాలో హాట్ టాపిక్

ఒకప్పుడు దక్షిణాది చిత్ర పరిశ్రమలో స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన నటి నమిత.. ప్రస్తుతం తన సినిమాల కంటే ఇంటర్వ్యూల్లో చేస్తున్న వ్యాఖ్యలతో వార్తల్లో నిలుస్తున్నారు. తాజాగా వివాహ వ్యవస్థ, మహిళలపై అమలయ్యే సంప్రదాయాల గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీశాయి. ముఖ్యంగా పెళ్లి తర్వాత పాటించాల్సిన కొన్ని సంప్రదాయాలు, నిబంధనలు కేవలం మహిళలకే ఎందుకు వర్తించాలంటూ నమిత ప్రశ్నించడం ఆసక్తికరంగా మారింది. వివాహం అనేది ఇద్దరు వ్యక్తుల జీవితాలను కలిపే బంధమని, అలాంటప్పుడు పెళ్లికి సంబంధించిన నియమాలు, బాధ్యతలు కూడా ఇద్దరికీ సమానంగా ఉండాలని నమిత అభిప్రాయపడింది. అయితే మన సమాజంలో కొన్ని సంప్రదాయాలు, ఆంక్షలు మాత్రం ప్రధానంగా మహిళలపైనే ఉండటంపై ఆమె ప్రశ్నలు సంధించింది. ముఖ్యంగా పెళ్లి తర్వాత మహిళలు ఎలా ఉండాలి, ఏం ధరించాలి, ఏ సంప్రదాయాలను పాటించాలి అనే విషయంలో ఎన్నో నియమాలు ఉంటాయని.. అదే సమయంలో పురుషులకు మాత్రం ఇలాంటి నిబంధనలు చాలా తక్కువగా ఉంటాయని ఆమె అభిప్రాయపడింది. ఈ విషయంలో మారుతున్న కాలానికి అనుగుణంగా ఆలోచించాల్సిన అవసరం ఉందని పేర్కొంది.నమిత చేసిన వ్యాఖ్యల్లో ముఖ్యంగా తాళి బొట్టు గురించి ప్రస్తావన సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. వివాహానికి గుర్తుగా మహిళలు మాత్రమే తాళి ఎందుకు ధరించాలి? పురుషులు కూడా పెళ్లయిందని తెలియజేసే ఏదైనా గుర్తును ఎందుకు ధరించకూడదు? అంటూ ఆమె ప్రశ్నించింది. వివాహం ఇద్దరు వ్యక్తుల



సమాన భాగస్వామ్యంతో సాగుతుందన్నప్పుడు.. వివాహానికి సంబంధించిన గుర్తింపు కూడా ఇద్దరికీ ఉండాలని ఆమె అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. కేవలం సంప్రదాయం పేరుతో మహిళలపైనే కొన్ని నిబంధనలను రుద్దడం సరికాదనే ఉద్దేశాన్ని నమిత వ్యక్తం చేసింది.నమిత వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్ల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. కొందరు ఆమె చెప్పిన అంశాన్ని సమర్థిస్తున్నారు. కాలం మారుతున్నప్పుడు సంప్రదాయాలను కూడా కొత్త కోణంలో చూడాల్సిన అవసరం ఉందని, భార్యాభర్తలిద్దరికీ సమాన హక్కులు, బాధ్యతలు ఉండాలని కామెంట్లు చేస్తున్నారు.మరోవైపు కొందరు మాత్రం నమిత వ్యాఖ్యలను వ్యతిరేకిస్తున్నారు. తరతరాలుగా వస్తున్న ఆచారాలు, సంప్రదాయాల వెనుక ఉన్న సాంస్కృతిక ప్రాధాన్యతను అర్థం చేసుకోకుండా వాటిని ప్రశ్నించడం సరికాదని అభిప్రాయపడుతున్నారు.

# 'మహారాజా హాస్టల్' మూవీ రివ్యూ!

హారర్ కామెడీ సినిమాలకు ఓటీటీ ఫ్లాట్ ఫామ్స్ పై లభించే ఆదరణ ఎక్కువ. అందునా మలయాళం నుంచి వచ్చే ఈ జోనర్ సినిమాల పట్ల మరింత ఆసక్తిని చూపుతుంటారు. అలా ఈ వారం ఓటీటీకి వచ్చిన సినిమాగా 'మహారాజా హాస్టల్' కనిపిస్తుంది. జూన్ 24వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, ఇప్పుడు 'ఆహా'లో అందుబాటులోకి వచ్చింది. అరవింద్ .. మిథున్ .. వర్కి .. ముగ్గురూ మంచి స్నేహితులు. ముగ్గురూ మిడిల్ క్లాస్ కుర్రాళ్లే. ఇంజనీరింగ్ కి రాగానే, అక్కడ అందమైన అమ్మాయిలు ఉంటారనే ఉద్దేశంతో పెద్ద కాలేజ్ లో చేరతారు. అయితే అక్కడ వాళ్లకి నిరాశే ఎదురవుతుంది. ఆ క్లాస్ లో అమ్మాయిలు పెద్దగా లేకపోవడంతో ముగ్గురూ డీలాపడిపోతారు. హాస్టల్ ఖర్చుల కోసం ఇంటి దగ్గర నుంచి వచ్చే డబ్బులు మిగుల్చుకుని, స్వేచ్ఛగా మందు కొట్టొచ్చని అనుకుంటారు. అందుకోసం ఎలాంటి వసతులు లేకపోయినా, ఒక పాతకాలం నాటి హాస్టల్లో చేరతారు. కాలేజ్ లో అరవింద్ కి 'దీపిక' అనే అమ్మాయి పరిచయమవుతుంది. అయితే ఆమెతో 'శంభూ' అనే మరో స్టూడెంట్ చాలా సన్నిహితంగా ఉంటూ ఉంటాడు. తనని గాయపరిచిన అరవింద్ టీమ్ పై కోపంతో అతను వాళ్లకి ఒక టాస్క్ ఇస్తాడు. అరవింద్ వాళ్లు అడవిలోకి వెళ్లి, అతను చెప్పిన చోటునున్న ఒక ఎర్ర క్లాత్ ను తీసుకురావలసి ఉంటుంది. ఆ అడవికి వెళ్లిన ముగ్గురూ భయంకరమైన ఆకారాన్ని చూసి, అక్కడి నుంచి పారిపోయి తిరిగొస్తారు. అప్పటి నుంచి ఆ ఆకారం తమను ఫాలో అవుతూ ఉండటం గమనిస్తారు.ఇక హాస్టల్లో వార్డెన్ పేరుతో ఒక వ్యక్తి, అరవింద్ బ్యాచ్ ను టార్చర్ చేస్తుంటాడు. అతని గదిలో దుమ్ముపట్టిపోయిన అతని ఫొటో వారికి కనిపిస్తుంది. ఆ వ్యక్తి చనిపోయి చాలాకాలం అవుతోందనే విషయం అప్పుడు వాళ్లకు అర్థమవుతుంది. గతంలో ఆ హాస్టల్ ను రన్ చేసింది అతనేనని వాచ్ మెన్ ద్వారా తెలుసుకుంటారు. అక్కడి నుంచి బయటపడటానికి ప్రయత్నిస్తే, గేటు దగ్గరే అడవి నుంచి తరుముకొచ్చిన ఆకారం అడ్డుకుంటూ ఉంటుంది.అడవిలోని ఆ భయంకరమైన ఆకారం ఎవరిది? చనిపోయిన వ్యక్తి ఆత్మ హాస్టల్లోనే ఎందుకు ఉంటోంది. ఈ రెండింటికీ .. ఈ ముగ్గురు యువకులకు గల



సంబంధం ఏమిటి? వాళ్లు ఎలాంటి పరిస్థితులను ఫేస్ చేయవలసి ఉంటుంది? అనేది కథ. ఇంజనీరింగ్ కాలేజ్ చేరిన ముగ్గురు మిడిల్ క్లాస్ కుర్రాళ్లు, డబ్బులు మిగుల్చుకోవడం కోసం ఒక పాతకాలం నాటి హాస్టల్ బిల్డింగ్ లో దిగుతారు. ఆ హాస్టల్లో ఉంటున్న ఆత్మ .. అడవి నుంచివారితో పాటు వచ్చిన ఒక మానవాతీత శక్తి వాళ్లను టార్చర్ చేస్తూ ఉంటాయి. అప్పుడు వాళ్లు ఏం చేస్తారు? ఆ గండం నుంచి ఎలా బయటపడతారు? అనేదే ఈ కథలోని ప్రధానమైన అంశం.అడవికి దగ్గరగా ఉన్న హాస్టల్ .. ఆ హాస్టల్లో దెయ్యం ఉండటం .. అది రాత్రి వేళల్లో స్టూడెంట్స్ ను భయభ్రాంతులకు గురిచేయడం .. ఆ దెయ్యంబారి నుంచి వాళ్లు ఎలా బయటపడతారు? అనే కథతో గతంలో చాలానే సినిమాలు వచ్చాయి. అలాగే కొంతమంది కాలేజ్ కుర్రాళ్లు అడవిలోకి వెళ్లి అక్కడి మానవాతీత శక్తిని నిద్రలేపడం .. అప్పటి నుంచి తరుముతున్న ఆశక్తి నుంచి తప్పించుకోవడం నేపథ్యంలోను చాలానే కథలు వచ్చాయి. అలాంటి రెండు కథలను కలుపుతూ తెరకెక్కించిన సినిమా ఇది. ఇక హాస్టల్లో ఉన్న ఆత్మ ఎవరిది? ఎందుకు హాస్టల్లోనే తిరుగుతోంది? అడవిలో దాగిన ఆ శక్తి ఏమిటి? అంతకుముందు ఏం జరిగి ఉంటుంది? ఎందుకు అవి ఈ ముగ్గురినే టార్గెట్ చేస్తున్నాయి? అనేవి ప్రేక్షకులలో ఆసక్తిని రేకెత్తించే అంశాలుగా కనిపిస్తాయి. అవేమిటో తెలుసుకోవడం కోసం ఆడియన్స్, ఆ ముగ్గురు కుర్రాళ్లను ఫాలో అవుతూ ఉంటారు. అయితే అలా పరుగెత్తుతూ వెళ్లిన ఆడియన్స్ కి ఆయాసం వస్తుంది .. నిరాశ కలుగుతుంది అంతే. ముగ్గురు కుర్రాళ్లు .. ఆకతాయి వేషాలు .. కాలేజ్ క్యాంపస్ గొడవలు .. హాస్టల్ అనుభవాలు .. ఇలా దర్శకుడు అసలు కథ దగ్గరికి తీసుకుని వెళ్లేసరికి సినిమాలో సగభాగం పూర్తవుతుంది. ఇక మిగతా సగంలో నైనా అసలు కథ ఏమైనా చెబుతాడేమోనని చూస్తే, అందుకు సంబంధించిన సన్నివేశాలను కూడా సాగదీస్తూ వెళ్లారు. హాస్టల్లో ఆత్మ వెనుక గల కథ .. అడవిలోని మానవాతీత శక్తి కథ కూడా చాలా పేలవంగా అనిపిస్తాయి.లవ్ .. కామెడీ .. ఎమోషన్ .. హారర్ ఈ నాలుగు అంశాలను కలుపుకుంటూ ఒక ఆసక్తికరమైన కథను తయారు చేయడంలో విఫలం కావడం కనిపిస్తుంది.

కథకు రెండు కళ్ల మాదిరిగా కనిపించే ఆత్మ పాత్రను .. మానవాతీత శక్తి పాత్రను డిజైన్ చేయడంలోను, చూపించడంలోను ఇదే పరిస్థితి. నటీనటుల నటన గురించి .. సాంకేతిక వర్గం పనితీరును గురించి మాట్లాడుకునే స్థాయిలో ఈ కంటెంట్ కనిపించదు. కొన్ని హారర్ కామెడీ సినిమాలు నవ్విస్తూనే భయపెడతాయి. మరికొన్ని హారర్ కామెడీ సినిమాలు నవ్వించకపోగా .. భయపెట్టకపోగా .. బాధపెడతాయి. ఆ రెండో కోవకి చెందిన సినిమా ఇది అని చెప్పచ్చు.



## రామ్ సినిమాలో సంయుక్త

స్టార్ హీరో రామ్ పోతినేని దర్శకునిగా మారిన విషయం విదితమే. ఆయన హీరోగా నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న 'RAPO 23'(వర్కింగ్ టైటిల్) చిత్రంలో సంయుక్త మీనన్ కథానాయికగా ఎంపికయ్యారు. శుక్రవారం ఆమె పుట్టిన రోజు సందర్భంగా సంయుక్తకు శుభాకాంక్షలు తెలుపుతూ ఓ ప్రత్యేక పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌తో ఆమె సినిమాలో భాగమైన విషయాన్ని మేకర్స్ ధృవీకరించారు. సైకలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రం ద్వారా దర్శకునిగా తన విజన్‌ని తెరపైకి తెచ్చే పనిలో ఉన్నారు హీరో రామ్. =ూరాూ సినిమాటిక్ యూనివర్స్ పతాకంపై కృష్ణ పోతినేని నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతున్నది. ఈ చిత్రానికి కెమెరా: తిరునావుక్కరసు, సంగీతం: సామ్ సిఎస్.

## ఓ భయానక ప్రపంచం



ప్రతిష్టాత్మక చిత్రాలను నిర్మించే మైత్రీ మూవీమేకర్స్ తొలిసారి హారర్ జానర్‌లోకి అడుగుపెట్టింది. అగ్ర దర్శకుడు ప్రశాంత్‌నీల్ సమర్పణలో వారు నిర్మిస్తున్న ఇంటెన్స్ హారర్ థ్రిల్లర్ '418'. కీర్తన్ నాదగౌడ దర్శకుడు. చైత్ర ఆచార్, సూర్య రాజ్, చరణ్ లక్కరాజు, ప్రీతి పగడాల, శశాంక్ పాటిల్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రం ట్రైలర్‌ని శుక్రవారం మేకర్స్ విడుదల చేశారు. 'ఈ పాడుబడిన ఇంట్లోకి ఓ పక్షి కూడా వెళ్లలేదు' అని వాచ్‌మెన్ చెప్పడంతో ట్రైలర్ మొదలైంది.ం15ఏండ్లుగా మూసి ఉన్న ఆ బిల్డింగ్‌ని స్థానికుల వ్యతిరేకత ఉన్నప్పటికీ తిరిగి తెరవడం.. ఆ బిల్డింగ్‌లోని రూమ్ నంబర్ 418లో భయంకరమైన రహస్యం దాగి ఉన్నట్టు ఎస్టాబ్లిష్ చేయడం.. దేవిక ఎంట్రీ.. ట్రైలర్‌లో ఉన్న ఈ అంశాలన్నీ సినిమాపై ఆసక్తిని పెంచాయి. రియాలిటీకి, హ్యాలుసినేషన్స్‌కి మధ్య చిక్కుకున్న వివేక్ పాత్ర కథలో కీలకమని తెలుస్తున్నది. ఆద్యంతం ఉత్కంఠభరితమైన మలుపులతో ఓ భయానక ప్రపంచాన్ని ఆవిష్కరించేలా ట్రైలర్ సాగింది. చైత్ర ఆచార్ ట్రైలర్‌లో హైలైట్‌గా నిలిచింది. ఈ చిత్రానికి కెమెరా: దినేష్ దివాకర్, సంగీతం: వెంకీ జీజీ, నిర్మాతలు: నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్.

# కౌబాయ్ అండ్ ఇండియన్



ఆంగ్ల చిత్రాల్లో నటిస్తూ గుర్తింపు తెచ్చుకున్న తెలుగు నటుడు మహేశ్ శ్రీరామ్ ప్రస్తుతం వీఎన్ ఆదిత్య దర్శకత్వం వహిస్తున్న 'ఫణి' సినిమాలో హీరోగా నటిస్తున్నారు. ఓఎంజీ ప్రొడక్షన్స్ పతాకంపై, ఏయు అండ్ ఐ స్టూడియోస్ సమర్పణలో డాక్టర్ మీనాక్షి అనిపిండి నిర్మిస్తున్న ఈ చిత్రంలో కేథరిన్ కథానాయికగా నటిస్తున్నది. త్వరలోనే హిందీతోపాటు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, ఇతర ప్రపంచ భాషల్లో 'ఫణి' విడుదల కానున్నది. మరోవైపు మహేశ్ శ్రీరామ్ హాలీవుడ్‌లో నటించిన 'కౌబాయ్ అండ్ ఇండియన్' సినిమా శనివారం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. ప్రముఖ హాలీవుడ్ నటుడు బ్రాడ్ నాప్ పోషించిన స్టీవ్ పాత్రకు స్నేహితుడైన విజయ్ పాత్రలో మహేశ్ శ్రీరామ్ కనిపించనున్నారు. స్నేహితుడికి అండగా నిలిచే ఈ పాత్రలో మహేశ్ శ్రీరామ్ నటన ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని మేకర్స్ చెబుతున్నారు. లియో పి షెల్లీ ఈ చిత్రానికి దర్శకుడు.

# నువ్వు సిన్నబోకే నా శ్రీలత

సుకుమార్ రైటింగ్స్, బన్నీ వాస్ వర్క్స్ పతాకాలపై రానున్న తెలంగాణ నేపథ్య కుటుంబకథా చిత్రం 'ఇడుపు కాయితం'. ప్రియదర్శి హీరోగా, తెలంగాణ జానపద గీతాల ద్వారా పేరు తెచ్చుకున్న నాగదుర్గ కథానాయికగా నటిస్తున్న చిత్రానికి వంశీరెడ్డి దొండపాటి దర్శకుడు. బన్నీ వాస్ నిర్మాత. మ్యూజిక్ ప్రమోషన్స్‌లో భాగంగా ఈ సినిమా నుంచి 'శ్రీలత..' అంటూ సాగే పాటను మేకర్స్ విడుదల చేశారు. 'శ్రీలత శ్రీలత శ్రీలత.. నువ్వు సిన్నబోకే నా శ్రీలత.. శ్రీలత శ్రీలత శ్రీలత.. ఈ శ్రీనివాసుడే నీ జత.. జీలకర బెల్లాన్ని పెట్టినా.. ఆ నెత్తిపై భారాన్ని పెట్టనే..' అంటూ సాగే ఈ పాటను అలరాజు రాయగా, సురేశ్ బొబ్బిలి స్వరపరిచారు. శంకర్‌బాబు, మోహన్ భోగరాజు ఆలపించారు. ఈ పాటలో హీరోహీరోయిన్ల కెమిస్ట్రీ ఆడియన్స్‌ని ఆకట్టుకుంటుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ పాటను చిత్రీకరించిన లొకేషన్లు, పిల్లలతో చేయించిన డ్యాన్స్ సీక్వెన్సులు పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని మేకర్స్ అంటున్నారు. ప్రస్తుతం రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని డిసెంబర్ తొలివారం విడుదల చేయనున్నారు. శివజ్యోతి, సుజాత, చంద్రవ్వ, మౌనికరెడ్డి, రచ్చరవి, బిత్తిరి సత్తి, అభయ్ బేతిగంటి, మైమ్ మధు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఎంఎన్ బాల్‌రెడ్డి.



## నా సినిమాలను నేను చూడలేను: ప్రీతి జింటా

ప్రముఖ బాలీవుడ్ నటి ప్రీతి జింటా కొంత కాలంగా సినిమాలకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. కొంత విరామం తర్వాత ఆమె 'వైబ్' అనే యాక్షన్ కామెడీ మూవీతో పాటు 'బట్వారా 1947' చిత్రం గ్రాండ్ రీఎంట్రీ ఇస్తోంది. 'వైబ్'లో ఆమె 'మేడమ్ హెచ్' అనే పవర్‌ఫుల్ సూపర్ స్పై పాత్రలో కనిపించనున్నారు. వంశిక ధీర్, కునాల్ ఖేము, స్పర్ష్ శ్రీవాస్తవ ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రం సెప్టెంబర్ 18న ప్రేక్షకుల ముందుకు రానుంది.తాజాగా జరిగిన ప్రమోషన్లలో నటి వంశిక ధీర్ మాట్లాడుతూ... పెద్ద తెరపై తనను తాను చూసుకున్నప్పుడు 'ఇంపాస్టర్ సిండ్రోమ్' అనిపించిందని చెప్పగా, ప్రీతి జింటా ఆసక్తికరంగా స్పందించింది. ఇన్ని ఏళ్ల అనుభవం ఉన్నా, ప్రతి కొత్త పాత్ర చేసేటప్పుడు 'చేయగలనా, లేదా?' అనే సందేహం తనకూ వస్తుందని ఆమె చెప్పింది. "నేను నా సినిమాలను స్క్రీన్ పై ఎప్పుడూ చూడలేను. థియేటర్‌లో కూర్చోవడం చాలా ఇబ్బందిగా ఉంటుంది. సినిమా చూస్తున్నంతసేపు ఈ సీన్ ఇంకా బాగా చేసి ఉంటే బాగుండేది అనే ఆలోచనే వస్తుంది" అని ప్రీతి వెల్లడించింది.



## అమ్మ ప్రేమపంచు నాన్నే..



శ్రీరామ్, రమిక శివ, తపస్విని పూనాచ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ప్రేమనే ఊరిలో'. మనోజ్ కుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని చందు శ్రీనివాస్, సురేష్ కొండేటి నిర్మిస్తున్నారు. శుక్రవారం ఈ సినిమా నుంచి 'అమ్మ ప్రేమ పంచు నాన్నే' అనే పాటను రిలీజ్ చేశారు. ఈ పాటకు సునాద్ గౌతమ్ స్వరాల్ని అందించగా రాంబాబు గోసాల సాహిత్యాన్ని అందించారు. రామ్ మిర్యాల ఆలపించారు. తండ్రి ప్రేమ తాలూకు భావోద్వేగాల్ని ఆవిష్కరిస్తూ ఈ పాట సాగింది. గ్రామీణ వాతావరణంలో సాగే హృద్యమైన కథాంశమిదని మేకర్స్ తెలిపారు.

# 'మండాడి'కి పెరుగుతున్న ఆదరణ..

## రెండో రోజు రెట్టింపైన టికెట్ బుకింగ్స్



కోలీవుడ్‌లో ప్రస్తుతం ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్న స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాల్లో 'మండాడి' ఒకటిగా నిలుస్తోంది. సూరి, సుహాస్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం ట్రైలర్‌తోనే మంచి ఆసక్తిని రేకెత్తించింది. ముఖ్యంగా సినిమాలో కనిపించిన అద్భుతమైన విజువల్స్, యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకుల్లో సినిమాపై అంచనాలను పెంచాయి. ఇక విడుదల తర్వాత కూడా ఈ క్రేజ్ క్రమంగా పెరుగుతున్నట్లు బాక్సాఫీస్ బుకింగ్స్ గణాంకాలు సూచిస్తున్నాయి. 'మండాడి'కి తొలి రోజు తమిళనాడులో మంచి ప్రారంభమే లభించింది. ప్రముఖ ఆన్‌లైన్ టికెటింగ్ వేదికలో మొదటి రోజున సుమారు 1.20 లక్షల టికెట్లు అమ్ముడైనట్లు సమాచారం. అయితే తెలుగు వెర్షన్ మాత్రం తొలి రోజు పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. దీంతో తమిళనాడి మార్కెట్‌పైనే సినిమా ఎక్కువగా ఆధారపడింది.భాషా కోర్సులు నేర్చుకోండి అయితే రెండో రోజుకు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందన, మౌత్ టాక్ కారణంగా బుకింగ్స్ ఒక్కసారిగా పుంజుకున్నాయి. రెండో రోజున 'మండాడి' ఏకంగా 2.40 లక్షల టికెట్లు విక్రయించినట్లు తెలుస్తోంది. అంటే తొలి రోజుతో పోలిస్తే బుకింగ్స్ దాదాపు రెట్టింపు అయ్యాయి. సాధారణంగా శుక్రవారం పని దినం కావడంతో సినిమాల వసూళ్లు కొంత నెమ్మదిగా ఉండే అవకాశం ఉంటుంది. కానీ 'మండాడి' విషయంలో అందుకు భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది.

# వరదల వేళ అప్రమత్తంగా ఉండండి

- ఏఎస్ఆర్ జిల్లాలో ప్రజల భద్రతకు ప్రాధాన్యం
- అవసరమైన చోట పునరావాస శిబిరాలు
- వాగులు పొంగుతున్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి..
- అధికారులకు ఆదేశించిన :పవన్ కల్యాణ్



**అమరావతి(ప్రశ్న న్యూస్)** అల్లూరి సీతారామరాజు జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో వర్షాలు, వరదల పరిస్థితిపై కలెక్టర్‌తోపాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సమీక్షించారు.ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పలు ప్రాంతాల్లో వాగులు, వంకలు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయని అధికారులు వివరించారు. కొన్ని గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని పవన్ కల్యాణ్ సూచించారు.15 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయిజీకే వీధి మండలం గంగవరం సమీపంలో ఏపీ--ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన వరద ప్రవాహానికి కొట్టుకుపోయింది. దీంతో సుమారు 15 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు.వర్షాలు తగ్గే వరకు అత్యవసర పరిస్థితులు మినహా ప్రజలు బయటకు రాకుండా విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదకర ప్రాంతాల్లో ముందస్తు హెచ్చరికలు జారీ చేసి, అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. అవసరమైన చోట తక్షణమే పునరావాస శిబిరాలు ఏర్పాటు చేసి ఆహారం, తాగునీరు, వైద్యం తదితర సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రాణనష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని, అత్యవసర సేవల సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఉత్తరాంధ్రలో భారీ వర్ష సూచనల నేపథ్యంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి జిల్లాల అధికారులను కూడా అప్రమత్తం చేశారు.

# భగవతి అమ్మవారి సేవలో: పవన్ కల్యాణ్

- చెట్టికులంగర ఆలయంలో ప్రత్యేక పూజలు,
- నవరాత్రుల అన్నదానానికి విరాళం



**అలప్పుజ(ప్రశ్న న్యూస్)** కేరళలోని అలప్పుజ జిల్లా చెట్టికులంగర శ్రీభగవతి అమ్మవారి ఆలయంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం పుష్పాంజలి సేవలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు.ముందుగా బాలశివుని దర్శించుకుని అర్చనలు చేసిన పవన్ కల్యాణ్ అనంతరం శ్రీ భగవతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని వినాయకుడు, నాగదేవతలకు కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మేల్‌శాంతి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

### అన్నదానానికి విరాళం

దసరా శరన్నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజులపాటు అమ్మవారి దర్శనానికి వచ్చే వేలాది మంది భక్తులకు నిర్వహించనున్న అన్నదానానికి అయ్యే మొత్తం వ్యయాన్ని పవన్ కల్యాణ్ దేవస్థానం బోర్డుకు విరాళంగా అందజేశారు. నవరాత్రుల్లో ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారని ఆలయ వర్గాలు తెలిపాయి.

### 1200 ఏళ్ల చరిత్ర

చెట్టికులంగర భగవతి ఆలయానికి 1200 ఏళ్లకు పైగా చరిత్ర ఉన్నట్లు ఆలయ సంప్రదాయాలు చెబుతున్నాయి. రాక్షస సంహారం కోసం శివుడి మూడో కన్ను నుంచి అమ్మవారు అవతరించినట్లు పురాణ కథనాలున్నాయి. త్రిశక్తి స్వరూపిణిగా భక్తులు అమ్మవారిని కొలుస్తారు. పుష్పాంజలి సేవను సర్వదోష నివారణ కోసం నిర్వహించే సంప్రదాయం ఉందని ఆలయ వర్గాలు పేర్కొన్నాయి.

# వర్షాలపై అప్రమత్తం

- ఆదివారం పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు,
- ముందస్తు చర్యలకు మంత్రి అనిత ఆదేశం



**అమరావతి(ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. ఆదివారం కూడా పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున క్షేత్రస్థాయిలో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.వర్షాల తీవ్రత ఎక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించి ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని మంత్రి ఆదేశించారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

### ముందస్తు హెచ్చరికలు

అల్పపీడనం తీవ్రత, వర్షాల పరిస్థితులపై ప్రభావిత జిల్లాల అధికారులకు ఎప్పటికప్పుడు స్పష్టమైన సమాచారం అందించాలని మంత్రి సూచించారు. భారీ వర్షాలు కురిసే ప్రాంతాల ప్రజలకు మొబైల్ హెచ్చరిక సందేశాలను నిరంతరం పంపించాలని ఆదేశించారు.ప్రజలకు అత్యవసర సమయంలో అందుబాటులో ఉండేలా 24 గంటలూ పనిచేసే కంట్రోల్ రూమ్‌లను కొనసాగించాలని అధికారులకు స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చోట తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

### వినాయక మండపాల వద్ద జాగ్రత్తలు

వినాయక చవితి వేడుకల నేపథ్యంలో మండపాల నిర్వాహకులు వర్షాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉండాలని మంత్రి అనిత విజ్ఞప్తి చేశారు. తాత్కాలిక షెడ్ల నిర్మాణంలో భద్రతా ప్రమాణాలు పాటించాలని, ముఖ్యంగా విద్యుత్ వైర్లు, విద్యుత్ పరికరాల విషయంలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.వర్షాల కారణంగా మండపాల వద్ద ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని మంత్రి కోరారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ అధికారులు, మండపాల నిర్వాహకులు సమన్వయంతో వ్యవహరించాలని స్పష్టం చేశారు.

# గిరిజనుల్లో నమ్మకం నింపిన పవన్ కల్యాణ్

- గిరిజనుల్లో నమ్మకం నింపిన పవన్ కల్యాణ్
- డోలీ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా చర్యలు,
- గిరిజన గ్రామాలకు రహదారులు
- ప్రతి జనసైనికుడు గిరిజనులకు అండగా నిలవాలి: నాగబాబు



**పార్వతీపురం(ప్రశ్న న్యూస్)** గిరిజనుల జీవితాల్లో మార్పు సాధ్యమేనన్న నమ్మకాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కల్పించారని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ నాగబాబు అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం వచ్చినా తమ జీవితాల్లో మార్పు ఉండదనే నిరాశ గిరిజనుల్లో ఉండేదని, ప్రస్తుతం పరిస్థితులు మారుతున్నాయని పేర్కొన్నారు. శనివారం పార్వతీపురంలో జనసైనికులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు.పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా, పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం పెరిగిందన్నారు. రహదారులు, రవాణా, తాగునీరు, విద్యుత్ వంటి సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

### డోలీ రహిత రాష్ట్రం లక్ష్యం

గిరిజనులు అత్యవసర వైద్యం కోసం డోలీలపై ఆధారపడే పరిస్థితికి ముగింపు పలకడమే లక్ష్యంగా 'డోలీ రహిత ఆంధ్రప్రదేశ్' దిశగా చర్యలు కొనసాగుతున్నాయని నాగబాబు చెప్పారు. జనాభా తక్కువగా ఉన్న గిరిజన గ్రామాలకు సైతం రహదారి సౌకర్యం కల్పించేందుకు 'అడవి తల్లి బాట' కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు.
గిరిజనుల సమస్యలు ఏ ప్రాంతానికి చెందినవైనా, ఏ రాజకీయ పార్టీకి చెందినవారైనా పవన్ కల్యాణ్ స్పందిస్తున్నారని చెప్పారు. ఒక గిరిజన గ్రామంలో విద్యుత్, రహదారి సౌకర్యాలు లేవని వీడియో ద్వారా సమస్యను తెలియజేయగా, వెంటనే స్పందించి రూ.10 కోట్లతో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నారని వివరించారు.

### గిరిజన గ్రామాలకు వెళ్లాలి

ప్రతి జనసైనికుడు తమ పరిధిలోని గిరిజన గ్రామాలను సందర్శించి ప్రజలతో మమేకం కావాలని నాగబాబు సూచించారు. వారి సమస్యలను స్వయంగా తెలుసుకుని, పరిష్కరించగల వాటికి తక్షణ సహాయం చేయాలని అన్నారు. తమ పరిధికి మించిన సమస్యలను పార్టీ దృష్టికి తీసుకురావాలని సూచించారు.
జనసేన పార్టీకి గిరిజన నియోజకవర్గాల్లో పెద్దగా ప్రాతినిధ్యం లేకపోయినా వారి సమస్యల పరిష్కారానికి పవన్ కల్యాణ్ ఎప్పుడూ వెనకడుగు వేయలేదన్నారు. గిరిజనుల సమస్యలను రాజకీయాలకు అతీతంగా మానవతా దృక్పథంతో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు.

### పచ్చదనం 50 శాతానికి..

రాష్ట్రంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా ఏపీ గ్రీన్ ఆధ్వర్యంలో చర్యలు చేపడుతున్నామని నాగబాబు తెలిపారు. చెట్ల పెంపకంతో పర్యావరణ పరిరక్షణతో పాటు భూగర్భ జలాల పెంపు, జీవ వైవిధ్య పరిరక్షణ, ఉపాధి అవకాశాలకు ప్రయోజనం కలుగుతుందని చెప్పారు.ప్రతి ఒక్కరూ తమ జీవితంలోని ముఖ్యమైన సందర్భాలను మొక్కలు నాటే కార్యక్రమాలతో ముడిపెట్టుకోవాలని సూచించారు. స్థానిక వాతావరణానికి అనువైన జాతుల మొక్కలను నాటి, వాటిని సంరక్షించాలని కోరారు. భవిష్యత్ తరాలకు పచ్చని వారసత్వాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు.జనసేనలో చేరికలుపార్వతీపురం జిల్లా పర్యటనలో నాగబాబు సమక్షంలో పలువురు జనసేనలో చేరారు. తూర్పు కాపు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్వి ఆధ్వర్యంలో ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెదమజ్జి సత్యనారాయణతో పాటు ఎస్. వెంకటరమణ, ఆవాల భాస్కరరావు, ఆవాల నాయుడు తదితరులు పార్టీలో చేరారు.కార్యక్రమంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ కొరికాన రవికుమార్, రాష్ట్ర జానపద కళలు, సృజనాత్మకత అకాడమీ చైర్మన్ వంపూరు గంగులయ్య, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గర్భాన సత్తిబాబు, పార్వతీపురం పీవోసీ ఆదాడ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# కేవైసీకి ముందే స్మార్ట్ రేషన్ కార్డులా.?

- మృతుల పేర్లతోనూ కార్డుల జారీ, బతికున్న కుటుంబ సభ్యులకు కార్డుల కోసం తిప్పలు
- ప్రజలకు ఉపయోగం కంటే ఇబ్బందులే ఎక్కువంటున్న బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ జాయింట్ సెక్రెటరీ మంత్రి వినోద్
- ప్రభుత్వం వెంటనే కేవైసీ గడువు పొడిగించాలి, రేషన్ కార్డుకు జీవితకాల చెల్లుబాటు కల్పించాలి




**తార్నాక (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం క్షేత్రస్థాయిలో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తోందని బీఆర్ఎస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ జాయింట్ సెక్రెటరీ మంత్రి వినోద్ ఆరోపించారు. కుటుంబ సభ్యుల కేవైసీ ప్రక్రియ పూర్తికాకముందే స్మార్ట్ రేషన్ కార్డులను ముద్రించడం వల్ల పలు కుటుంబాలు సమస్యలను ఎదుర్కొంటున్నాయని ఆయన పేర్కొన్నారు.కుటుంబంలో ఎవరు జీవించి ఉన్నారు. ఎవరు మరణించారు అనే వివరాలను నిర్ధారించేందుకు కేవైసీ ప్రక్రియ చేపడుతున్నప్పుడు, అదే ప్రక్రియ పూర్తికాకముందే కార్డులను ముద్రించడం ఎంతవరకు సమంజసమని మంత్రి వినోద్ ప్రశ్నించారు. కొన్నిచోట్ల ఇప్పటికే మరణించిన వ్యక్తుల పేర్లతో సైతం స్మార్ట్ రేషన్ కార్డులు జారీ అవుతున్నాయని, దీంతో కుటుంబంలోని ఇతర సభ్యులకు సరైన కార్డు పొందడంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆయన ఆరోపించారు.

### రేషన్ కోసం కూడా ఇబ్బందులేనా.?

మృతుల వివరాలు కార్డుల్లో కొనసాగుతుండటంతో కుటుంబ సభ్యుల వివరాల సవరణ, కొత్త కార్డు జారీ తదితర ప్రక్రియల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని మంత్రి తెలిపారు. రేషన్ పొందడంలో కూడా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో అధికారుల వద్దకు వెళ్లి సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రజలు పలుమార్లు తిరగాల్సి వస్తోందన్నారు.
కేవైసీకి ప్రభుత్వం మరింత సమయం ఇవ్వాలని, గడువును పొడిగించి ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను పూర్తిస్థాయిలో పరిశీలించిన అనంతరం స్మార్ట్ రేషన్ కార్డులను జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

### ప్రభుత్వం మారితే.. కార్డు మారాలా.?

స్మార్ట్ రేషన్ కార్డులపై ముఖ్యమంత్రి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఫొటోలు ముద్రించడం వల్ల భవిష్యత్తులో ప్రభుత్వం మారిన ప్రతిసారీ కొత్త కార్డుల జారీ అవసరం ఏర్పడే అవకాశం ఉందని మంత్రి వినోద్ విమర్శించారు. ప్రభుత్వాలు మారినా ప్రజలకు ఇబ్బంది కలగకుండా రేషన్ కార్డు శాశ్వత గుర్తింపు పత్రంగా ఉండేలా విధానం రూపొందించాలని సూచించారు.ఆధార్ కార్డు విషయంలో కేంద్ర ప్రభుత్వం ఒకసారి గుర్తింపు కల్పించిన తర్వాత ప్రభుత్వం మారినా ప్రజలు మళ్లీ మళ్లీ కొత్త ఆధార్ కోసం దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని ఆయన ఉదాహరణగా పేర్కొన్నారు. అదే విధంగా రేషన్ కార్డును కూడా ప్రభుత్వానికి కాకుండా ప్రజలకు సంబంధించిన శాశ్వత పత్రంగా రూపొందించాలని అన్నారు.

### ప్రజాధనం వృథా కాకుండా చూడాలి

ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ కొత్త కార్డుల ముద్రణకు ప్రజాధనం ఖర్చు చేయాల్సిన పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి వినోద్ కోరారు. రేషన్ కార్డుపై వ్యక్తుల ఫొటోలు, రాజకీయ నాయకుల పేర్లు కాకుండా తెలంగాణ రాష్ట్ర అధికారిక లోగోతో కార్డులను రూపొందిస్తే ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు.ప్రజా ప్రభుత్వం అంటే ప్రజలకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవాలి. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పే విధానాలు తీసుకురావడం సరికాదు అని మంత్రి వినోద్ ఆగ్రహం వ్యక్తం చేశారు.క్షేత్రస్థాయిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిశీలించి పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.



### అధికారంలోకి వస్తే లోగోతోనే కార్డులు

రాబోయే రెండు సంవత్సరాల లో బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందని ప్రస్తుత ముఖ్యమంత్రి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఫొటోలను తొలగించి తెలంగాణ రాష్ట్ర లోగోతో స్మార్ట్ రేషన్ కార్డులను ప్రజలకు అందజేస్తామని మంత్రి వినోద్ తెలిపారు. ఒకసారి జారీ చేసిన రేషన్ కార్డు ప్రజలకు జీవితకాలం ఉపయోగపడేలా విధానం రూపొందిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# కపిలేశ్వరాలయంలో వినాయక చవితి వేడుకలు

- 14న ప్రత్యేక పూజలు..
- మూషిక వాహనంపై గ్రామోత్సవం

**తిరుపతి(ప్రశ్న న్యూస్)** తిరుపతి శ్రీకపిలేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 14న వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను టీటీడీ అధికారులు ఏర్పాటు చేశారు.వినాయక చవితి సందర్భంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపిన అనంతరం శ్రీ వినాయకస్వామివారి మూలవర్లకు అభిషేకం, అర్చన నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండటంతో పూజా కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

### మూషిక వాహనంపై గ్రామోత్సవం

సాయంత్రం 5.30 గంటలకు శ్రీ వినాయకస్వామివారికి మూషిక వాహనంపై గ్రామోత్సవం నిర్వహించనున్నారు. స్వామివారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి మూషిక వాహనంపై ఊరేగించనున్నారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొననున్నారు.

### రెండో ఘాట్ రోడ్డులోనూ ప్రత్యేక పూజలు



తిరుమల రెండో ఘాట్ రోడ్డులోని శ్రీ వినాయకస్వామివారి ఆలయంలోనూ వినాయక చవితి వేడుకలను నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు మూలవర్లకు అభిషేకం, అర్చనతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టనున్నారు.వినాయక చవితి సందర్భంగా రెండు ఆలయాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయనున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు.

# 22ఏ భూముల వివాదం.. నిజమైన సంక్షోభమా.?

## - బీఆర్ఎస్ మైండ్ గేమా.?




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాల్లో రిజిస్ట్రేషన్ల చట్టంలోని సెక్షన్ 22ఏ నిషేధిత భూముల జాబితా అంశం తీవ్ర దుమారం రేపుతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేవలం 16 లక్షల ఎకరాలు మాత్రమే నిషేధిత జాబితాలో ఉంటే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏకంగా కోటి 16 లక్షల ఎకరాలను 22ఏ పరిధిలోకి నెట్టేశారు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపిస్తున్నారు. మరోవైపు, 22ఏ కింద పొరపాటుగా చేరిన ప్రైవేట్ భూములు కేవలం కొన్ని వేల ఎకరాలు లేదా కొన్ని లక్షల ఎకరాలేనని, గత ప్రభుత్వ హయాంలో ఉన్న రికార్డులను సవరించే క్రమంలో డిజిటల్ డేటా అప్‌డేట్‌లో జరిగిన సాంకేతిక పొరపాట్లను మాత్రమే బీఆర్ఎస్ పెద్దది చేసి చూపిస్తోంది అని ప్రభుత్వ వర్గాలు, చీఫ్ విప్ ఆది శ్రీనివాస్ ఖండిస్తున్నారు. ఎవరి లెక్కల్లో నిజముంది, అసలు సమస్య తీవ్రత ఎంత అనే అంశంపై రాజకీయ పరిశీలన ఆసక్తికరంగా మారింది.

### - సాంకేతిక సమస్య అంటున్న ప్రభుత్వం

సాంకేతికంగా పరిశీలిస్తే, తెలంగాణ మొత్తం వైశాల్యం దాదాపు 2.75 కోట్ల ఎకరాలు కాగా, అందులో దాదాపు 1.5 కోట్ల ఎకరాలకు మాత్రమే పట్టాదార్ పాస్‌పుస్తకాలు ఉన్నాయి. మిగిలిన భూమి ప్రభుత్వ, అటవీ, అసైన్డ్, ఇనాం, దేవాదాయ, వక్ఫ్ మరియు వివిధ వివాదాల్లో ఉన్న భూములు. రెవెన్యూ రికార్డులను ధరణి నుంచి కొత్తగా తెచ్చిన భూభారతి సిస్టమ్‌లోకి డిజిటలైజ్ చేసే సమయంలో, చట్టబద్ధమైన క్లారిటీ లేని నిరుపయోగ లేదా అసైన్డ్, ప్రభుత్వ భూముల కేటగిరీలన్నింటినీ సిస్టమ్ ఆటోమేటిక్‌గా 22ఏ డ్రావర్లోకి నెట్టేసింది. కేటీఆర్ చెబుతున్న కోటి ఎకరాల లెక్కలో అటవీ భూములు, ప్రభుత్వ రిజర్వ్ కేటగిరీలు, చెరువులు, కుంటలు , పాత అసైన్డ్ భూములు ఉన్నాయి. అయితే, సాధారణ ప్రజలకు సంబంధించిన ప్రైవేట్ పట్టా భూములు ఇందులో చిక్కుకోవడం వల్లనే అసలు వివాదం రాజుకుంది.

### - హైదరాబాద్ చుట్టుపక్కల లేఔట్లకు ఇబ్బంది

వాస్తవానికి క్షేత్రస్థాయిలో సమస్య తీవ్రత ఉందా అంటే ఖచ్చితంగా హైదరాబాద్ చుట్టుపక్కల మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లోనూ, ఉమ్మడి జిల్లాల పట్టణ ప్రాంతాల్లోనూ లేఅవుట్లు, ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసిన సామాన్యులకు రిజిస్ట్రేషన్లు కాక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇన్నాళ్లూ క్రయవిక్రయాలు జరిగిన భూములు ఉన్నట్టుండి 22ఏ లోకి మారడంతో ప్లాట్ల యజమానులు అభద్రతాభావానికి గురయ్యారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్వయంగా అసెంబ్లీ వేదికగానూ, ప్రెస్ మీట్లలోనూ స్పందిస్తూ సాంకేతిక పొరపాట్ల వల్ల కొన్ని ప్రైవేట్ ఆస్తులు 22ఏలోకి వచ్చాయి, బాధితులకు క్షమాపణలు చెబుతున్నాం అని ప్రకటించాల్సి వచ్చింది. ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి విజ్ఞప్తులు స్వీకరిస్తుండటం ప్రభుత్వం సమస్య ఉనికిని అంగీకరించినట్లే స్పష్టం చేస్తోంది.

### - ఈ సమస్యను బీఆర్ఎస్ ఎంతవరకు వాడుకుంటోంది?

అసెంబ్లీ ఎన్నికల ఓటమి, పార్లమెంట్ ఎన్నికల దెబ్బ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిఫెన్స్ లోకి నెట్టేందుకు బీఆర్ఎస్ కు '22ఏ' ఒక బలమైన ఆయుధంగా దొరికింది. తెలంగాణలో భూమి అనేది అత్యంత భావోద్వేగపూరితమైన అంశం. గతంలో తాము తెచ్చిన ధరణిని కాంగ్రెస్ ప్రభుత్వం విమర్శించినందున, ఇప్పుడు కాంగ్రెస్ తెచ్చిన రెవెన్యూ మార్పుల లోపాలను ఎండగట్టడానికి కేటీఆర్, హరీశ్‌రావు ఈ అంశాన్ని ముమ్మరంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. ప్రజా పోరాటాలుగా కంటే, ప్రతిపక్ష పార్టీగా బాధితుల సమావేశాలు ఏర్పాటు చేసి ప్రభుత్వం భూములను కాజేయడానికే 22ఏ ని వాడుతోంది అనే నెరేటివ్‌ను సెట్ చేయడానికి బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది.

### - బీఆర్ఎస్ ప్రజల్ని రోడ్లపైకి తీసుకు రాగలదా?

బాధితులు ఎందుకు వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేయడం లేదనే దానికి కారణం ఈ ఇబ్బంది పడుతున్న వారిలో ఎక్కువ మంది పట్టణాల్లోని మధ్యతరగతి చెందిన ప్లాట్ల యజమానులు కావడమే. వీరు ప్రజా ఉద్యమాల కంటే చట్టపరమైన పరిష్కారాలకో లేదా కలెక్టరేట్లలో దరఖాస్తులు చేసుకునే మార్గానికో ప్రాధాన్యత ఇస్తారు.

పైగా, ప్రభుత్వం సవరణ ప్రక్రియను వేగవంతం చేసి, అభ్యంతరాలను స్వీకరిస్తుండటంతో మా భూమి మాకు వస్తుందిలే అనే ఆశతో చాలామంది వేచి చూసే ధోరణిలో ఉన్నారు. 22ఏ వివాదంలో కోటి ఎకరాలు ఆక్రమణలకు గురవుతున్నాయి అన్నది బీఆర్ఎస్ రాజకీయంగా పెంచి చూపుతున్న అంకె అయితే, ఏమీ లేదంతా సాధారణమే అనడం కాంగ్రెస్ డిఫెన్సివ్ టాక్టిక్. రాత్రికి రాత్రే ప్రైవేట్ ఆస్తులు నిషేధిత జాబితాలోకి వెళ్లడం వల్ల సామాన్య ప్రజల్లో ఆందోళన కలగడం పచ్చని నిజం. ఈ సమస్యను ఎంత త్వరగా క్లియర్ చేసి, నిజమైన హక్కుదారులకు క్లియరెన్స్ ఇస్తే అంత త్వరగా కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ విసురుతున్న రాజకీయ బాణాల నుంచి బయటపడగలదు.

# కల్తీ పన్నీర్‌పై నలుగురు పాత్రికేయుల పోరాటం అభినందనీయం

### టిజిఎస్ రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) కల్తీ పన్నీర్ తయారీ విక్రయాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ప్రజారోగ్య పరిరక్షణ కోసం నలుగురు పాత్రికేయులు గౌటి రామకృష్ణ, బొడికె వాణి, గంగి కృష్ణ, సతీష్ సాగిస్తున్న పోరాటం అభినందనీయమని తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర అన్నారు.కల్తీ పన్నీర్ తయారీ విక్రయాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న పాత్రికేయులపై భౌతిక దాడులు జరుగుతున్నప్పటికీ వారికి రక్షణ కల్పించాల్సిన పోలీసు యంత్రాంగమే పాత్రికేయులపై అక్రమ కేసులు నమోదు చేయడం శోచనీయమని ఆయన పేర్కొన్నారు.ప్రజల ఆరోగ్యం కోసం నిజాలను వెలుగులోకి తీసుకువస్తున్న పాత్రికేయులను వేధించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని రాజేష్ ఖన్నా పేర్కొన్నారు. పాత్రికేయులు తమ విధులను స్వేచ్ఛగా నిర్వర్తించేలా ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం తగిన రక్షణ కల్పించాలని కోరారు.ఈ విషయంపై తెలంగాణ రాష్ట సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి వెంటనే కలుగజేసుకొని పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి పాత్రికేయులపై నమోదైన అక్రమ కేసులను ఉపసంహరించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అదేవిధంగా పాత్రికేయులపై దాడి చేసిన మాఫియా సభ్యులపై కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ప్రజల శ్రేయస్సు కోసం నిస్వార్థంగా విధులు నిర్వహిస్తున్న పాత్రికేయులపై భవిష్యత్తులో దాడులు వేధింపులు జరగకుండా వారికి తగిన రక్షణ కల్పించేలా పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు.ప్రజారోగ్య పరిరక్షణ కోసం పోరాడుతున్న పాత్రికేయులకు తెలంగాణ గంగపుత్ర సంఘం అండగా నిలుస్తుందని రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర స్పష్టం చేశారు.

# సహకారమే బ్రిక్స్ చోదకశక్తి

### - 'న్యూఢిల్లీ డిక్లరేషన్ 2026'కు ఏకగ్రీవంగా ఆమోదం



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) సహకార స్ఫూర్తితో ముందుకు సాగుతూ, మరింత సమ్మిళితమైన, సంపన్నమైన ప్రపంచాన్ని నిర్మించేందుకు బ్రిక్స్ సభ్యదేశాలు కట్టుబడి ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఢిల్లీలోని భారత్ మండపంలో శనివారం ప్రారంభమైన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఐక్యతకు, ఉమ్మడి లక్ష్యాల సాధనకు ఈ వేదిక నిదర్శనమని విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ సందర్భంగా బ్రిక్స్ దేశాల అధినేతలు భారత్ మండపంలో ఏర్పాటు చేసిన వృక్షోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసాతో పాటు ఇతర సభ్య, భాగస్వామ్య దేశాల నేతలు ప్రధాని మోదీతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం నేతలందరూ ఒకరి చేతులు మరొకరు పట్టుకుని సామూహిక చిత్రానికి (గ్రూప్ ఫొటో) పోజులిచ్చి, తమ ఐక్యతను చాటిచెప్పారు.

సదస్సులో భాగంగా 'సమ్మిళిత ప్రపంచ పాలన, బహుపాక్షికతను బలోపేతం చేయడం' అనే అంశంపై చర్చలు జరిగాయి. ఈ భేటీలో "న్యూఢిల్లీ డిక్లరేషన్ 2026"ను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. బ్రిక్స్ కూటమి ఏర్పాటై 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రెండు ప్రత్యేక పోస్టల్ స్టాంపులను కూడా విడుదల చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, "ఈ డిక్లరేషన్ మన ఉమ్మడి సంకల్పానికి స్పష్టమైన దిశానిర్దేశం చేస్తుంది. ఈ తీర్మానాలను సత్ఫలితాలుగా మార్చడం మనందరి బాధ్యత" అని పేర్కొన్నారు.

# మట్టి గణపతిని ఆరాధిద్దాం - పర్యావరణాన్ని కాపాడుకుందాం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించి మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పర్యావరణ పరిరక్షణలో మట్టి వినాయకుడి ప్రాముఖ్యత అత్యంత కీలకమైనది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ రసాయన రంగులతో చేసే విగ్రహాల వల్ల ప్రకృతికి జరిగే నష్టాన్ని నివారించడానికి మట్టి గణపతులను పూజించడమే ఏకైక మార్గం. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కాలుష్య కారకాలైన పీఓపీ విగ్రహాల నిమజ్జనం వల్ల జలాశయాలు, చెరువులు, ఇతర నీటి వనరులు కలుషితమై ప్రకృతితో పాటు ప్రాణికోటికి తీవ్ర ముప్పుగా పరిణమిస్తుంది. పర్యావరణ పరిరక్షణలో ప్రతీ ఒక్కరి భాగస్వామ్యం అవసరం ఉంది. వినాయక చవితి మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన పండుగ. అదే సమయంలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తు పండుగను జరుపుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. మట్టి గణపతులను ప్రతిష్ఠించడం ద్వారా మన సంప్రదాయాన్ని కాపాడటంతో పాటు చెరువులు, కుంటలు, జలవనరులను కాలుష్యం నుంచి కాపాడుకోవచ్చు. రసాయన రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని, జలచరాలు, పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. అందువల్ల సహజ సిద్ధమైన మట్టితో తయారు చేసిన గణేశ్ విగ్రహాలను మాత్రమే తయారు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి నిమజ్జనాలు చేయడం ద్వారా పర్యావరణానికి మేలు చేకూరుతుందన్నారు. మట్టి గణపతిని ఆరాధిద్దామని. ప్రకృతిని కాపాడుకుందామనే నినాదంతో విసృతంగా ప్రచారం చేస్తు పర్యావరణ పరిరక్షణపై ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన అవసరం ఉంది. మన వినాయకుడు మట్టితో వస్తే మన భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ప్రకృతి మిగులుతుంది. ప్రతి కుటుంబం, ప్రతి కాలనీ, ప్రతి గణేష్ మండపాల్లో మట్టి గణపతులనే ప్రోత్సహించి పర్యావరణహితమైన వినాయక చవితి నిర్వహణకు ఆదర్శంగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పర్యావరణ పరిరక్షణ కోసం ఈ సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేసి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలిరకరకాల రంగులతో, రసాయనాలతో తయారు చేసే వినాయకులకు పూజ చేసి చెరువులను అలాగే పర్యావరణ కాలుష్యం చేయకుండా మట్టి వినాయకులనే ప్రతిష్టించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి నిమజ్జనం చేయాలని పర్యావరణ వేత్తలు డిమాండ్ సూచిస్తున్నారు. ఒకప్పుడు వినాయకుణ్ణి తయారు చేయడానికి చెరువు మట్టిని వాడి మళ్ళీ అందులోనే నిమజ్జనం చేసేవారాని, మళ్ళీ అలాంటి రోజులు రావాలని, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని తెలుసుకోవాలని పలువురు సూచిస్తు, పోటీలకు పోకుండా ఆధ్యాత్మిక మార్గంలో ఆలోచించి మట్టి



వినాయక విగ్రహాలను ప్రతిష్టించి స్వామి వారి సేవలో తరించాలని ప్రకృతి ప్రేమికులు కోరుకుంటున్నారు.

# మొక్కలను నరికేస్తున్నారా.. ఒకసారి ఆలోచించండి

### గజ్వేల్--ప్రజ్ఞాపూర్‌లో హరితహారం మొక్కలపై అధికారుల నిర్లక్ష్యం

### సొంత వ్యాపార అవసరాల కోసం చెట్ల నరికివేతపై స్థానికుల ఆవేదన

గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) గజ్వేల్-ప్రజ్ఞాపూర్, తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ ఆధ్వర్యంలో 2014లో ప్రారంభమైన హరితహారం కార్యక్రమంలో భాగంగా గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో ప్రధాన రహదారికి ఇరువైపులా పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. నాటిన మొక్కల్లో అనేక చెట్లు ప్రస్తుతం పెరిగి పచ్చదనాన్ని అందిస్తున్నాయి.

అయితే ప్రజ్ఞాపూర్‌లోని ప్రధాన రహదారి నుంచి శివాలయం కామన్ వరకు రహదారికి ఇరువైపులా ఉన్న కొన్ని మొక్కలను వ్యాపార అవసరాల కోసం నరికివేస్తున్నారనే ఆరోపణలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. దీనిపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు."మన ప్రాంతానికి చెందిన వ్యక్తి చెట్లను నరికితే మున్సిపల్ అధికారులు జరిమానాలు విధిస్తారు. మరి వ్యాపార అవసరాల కోసం ఎవరైనా చెట్లను తొలగిస్తే నిబంధనలు వర్తించవా.? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సొంత వ్యాపారాల కోసం స్వార్థంగా చెట్లను నరికి వేస్తే భవిష్యత్ తరాల కోసం పచ్చదనాన్ని కాపాడాలనే ఉద్దేశంతోనే ఈ విషయాన్ని పాలకుల, అధికారుల దృష్టికి తీసుకువస్తున్నామని స్థానికులు పేర్కొంటున్నారు.ప్రజ్ఞాపూర్ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఒక్కసారి ప్రధాన రహదారి నుంచి శివాలయం కామన్ వరకు పరిశీలించి చూడాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికే పెరిగిన చెట్లను నరికి వేయడం వల్ల పర్యావరణంపై ప్రభావం పడటంతో పాటు పట్టణ సౌందర్యం కూడా దెబ్బతింటుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోట్లు ఖర్చు చేసిహరితహారం ద్వారా నాటిన ప్రతి మొక్క మన భవిష్యత్తుకు ఆస్తి. అభివృద్ధి అవసరమే.. కానీ చెట్లను కాపాడుతూ అభివృద్ధి చేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం వెనుక ముందుగానే వాళ్లకు సమాచారం ఉన్నట్లు స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణ



పరిరక్షణ, చెట్ల పెంపకం పై మున్సిపల్ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే చెట్ల నరికివేతను ఆపివేయాలని దానితోపాటు ఇప్పటివరకు చెట్లను నరికి వేసిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకొని మరిన్ని మొక్కలు



వాళ్లతో నాటించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.చెట్ల తొలగింపుపై మున్సిపల్ అధికారులు పరిశీలించి, సహకరించిన కిందిస్థాయి సిబ్బంది, అధికారులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే తొలగించిన చోట కొత్త మొక్కలు నాటాలని స్థానికులు కోరుతున్నారు.

# 25,000 క్యాబ్ డ్రైవర్ల సమ్మె

### - శంషాబాద్‌లో ప్రయాణికులకు ఇబ్బందులు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ)లో క్యాబ్ సేవలు పూర్తిగా స్తంభించిపోయాయి. తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ (టీజీపీడబ్ల్యూయూ) ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం నుంచి దాదాపు 25,000 మంది క్యాబ్ డ్రైవర్లు సమ్మె చేపట్టారు. ఓలా, ఉబెర్, రాపిడో వంటి ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఎయిర్‌పోర్ట్ ట్రిప్పులను డ్రైవర్లు పూర్తిగా బహిష్కరించారు. ప్రభుత్వం 2022 డిసెంబర్ 9న జారీ చేసిన జీవో 46ను తక్షణమే అమలు చేయాలన్నది డ్రైవర్ల ప్రధాన డిమాండ్. ఈ జీవో ప్రకారం, ఎయిర్‌పోర్ట్ ప్రీపెయిడ్ సర్వీసులకు కిలోమీటరుకు రూ. 21 చొప్పున ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. అయితే, ప్రస్తుతం తమకు కిలోమీటరుకు కేవలం రూ. 12 నుంచి రూ. 15 మాత్రమే అందుతున్నాయని యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ ఆరోపించారు.ఈ అంశంపై ఆగస్టు 31న కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ ఆధ్వర్యంలో యూనియన్ ప్రతినిధులు, కంపెనీల యాజమాన్యాలతో కీలక సమావేశం జరిగింది. జీవో నిబంధనల ప్రకారం ఛార్జీలు చెల్లించాలని అధికారులు ఆదేశించినప్పటికీ, సదరు కంపెనీలు వాటిని బేఖాతరు చేశాయని యూనియన్ ఆవేదన వ్యక్తం చేసింది. "మేము ఎలాంటి ప్రత్యేక సౌకర్యాలు కోరడం లేదు. మాకు దక్కాల్సిన చట్టబద్ధమైన ఛార్జీలతో పాటు వృత్తిపరమైన గౌరవం, సమానత్వం కావాలి" అని అన్నారు. ఈ సమస్యలపై సమగ్రంగా చర్చించి, లిఖితపూర్వక హామీ ఇచ్చేందుకు ప్రభుత్వం వెంటనే సంబంధిత భాగస్వామ్య పక్షాలతో సమావేశం ఏర్పాటు చేయాలని యూనియన్ విజ్ఞప్తి చేసింది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588